విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily

సంపుటి : 3 | సంచిక : 293 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 16 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

మా డ్రోన్ సాంకేతికతను అమెరికా అడిగింది

డ్రోన్ రక్షణలో మాకు కీవ్ సాయం అవసరం లేదంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తోసిపుచ్చారు. ఓ నిర్దిష్ట దేశం కోసం లేదా అమెరికన్లకు సాయం చేయాల్సిందిగా వాషింగ్టన్ తమను చాలాసార్లు సంప్రదించిందని స్పష్టంచేశారు. ఉక్రెయిన్ డ్రోన్ల సాంకేతికతను అందించేందుకు గతేడాది 35 బిలియన్ డాలర్ల విలువైన రక్షణ సహకార ఒప్పందాన్ని అమెరికాకు ప్రతిపాదించానని, ఇందుకు వాషింగ్టన్ సైనిక అధికారులు ఆసక్తి చూపుతున్నారన్నారు. ట్రంప్ స్వయంగా ఈ ఒప్పందానికి అంగీకరించినట్లు తెలిపారు. ఈ ఒప్పందంపై ఇప్పటివరకు ఎందుకు సంతకాలు జరగలేదో తనకు తెలియదని, భవిష్యత్తులో ఒప్పందం కుదరొచ్చని వెల్లడించారు. మరోవైపు అమెరికా

- మిగతా2లో

ఇరాన్‌పై నిప్పుల వాన

- ఇస్ఫహాన్ నగరంలో విధ్వంసం
- 15 మంది మృత్యువాత
- 'షిరాజ్'పైనా దాడులు
- గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు
- అమెరికా, ఇజ్రాయెల్ మినహా మిగిలిన దేశాల నౌకలకు అనుమతి



- మిగతా2లో

ఎంపీ పుట్టా మహేశ్ కు టీడీపీ షోకాజ్ నోటీసు

- డ్రగ్స్ వ్యవహారంలో చిక్కుకున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్
- పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని టీడీపీ హైకమాండ్ ఆదేశం
- 5 రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ నోటీసు
- పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించారని నోటీసులో వెల్లడి
- ఎంపీ ఇచ్చే వివరణ తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టీకరణ

తెలుగుదేశం పార్టీకి చెందిన ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేశ్ పై పార్టీ అధిష్ఠానం క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది. హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన పార్టీలో ఆయన మత్తుపదార్థాలు తీసుకున్నారన్న అంశం నేపథ్యంలో, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై

- మిగతా2లో

ఆ ఇద్దరి వరకూ దర్యాప్తు వెళ్లాలి

- వారి నుంచి కూపీ లాగితే అసలు నిందితులు దొరికేవారు
- వివేకా హత్యరోజు భారతి కాల్‌డేటాపై విచారణ ఎందుకు సాగలేదు?
- సీబీఐ సమగ్రంగా దర్యాప్తు చేయకుండా వదిలేసింది
- మాజీ మంత్రి వివేకా కుమార్తె సునీత

తన తండ్రి, మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు సక్రమంగా సాగట్లేదని ఆయన కుమార్తె డాక్టర్ సునీత అనుమానం వ్యక్తం చేశారు. హత్య జరిగి ఏడేళ్లయినా హంతకులెవరు? ఎందుకు చేశారు, చేయించారన్నది తేలలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులకు ఆదివారం వివేకా వర్ధంతి సందర్భంగా వచ్చిన సునీత.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్

- మిగతా2లో

అమరావతిలో నేడు అమరజీవి విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం చంద్రబాబు

- అమరావతిలో కొలువుదీరిన 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం
- 125వ జయంతి సందర్భంగా రేపు ఆవిష్కరించనున్న సీఎం చంద్రబాబు
- విగ్రహం ఏర్పాటుకు 26 టన్నుల కాంస్యం వినియోగం
- రెండో దశలో మ్యూజియం, ఆడిటోరియం నిర్మాణం
- విజయవాడలో ప్రభుత్వం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులోనూ పాల్గొననున్న ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు (మార్చి 16) అమరావతి, విజయవాడ నగరాల్లో రెండు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటారు. తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని అమరావతిలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం, పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా విజయవాడలో ప్రభుత్వం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. వివరాల్లోకి వెళితే, సోమవారం ఉదయం 11:15 గంటలకు అమరావతిలోని శాఖమూరు పార్కు వద్ద ఏర్పాటు చేసిన 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరిస్తారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ పొట్టి శ్రీరాములు 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన విషయం తెలిసిందే. ఆయన త్యాగానికి ప్రతీకగా 58 అడుగుల ఎత్తుతో ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దారు. రూ.150 కోట్ల అంచనా వ్యయంతో 6.80 ఎకరాల విస్తీర్ణంలో తలపెట్టిన పొట్టి శ్రీరాములు స్మృతివనం ప్రాజెక్టులో భాగంగా మొదటి దశ పనులు పూర్తయ్యాయి. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ కేవలం ఆరు నెలల రికార్డు సమయంలో ఈ భారీ విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేసింది. ఈ విగ్రహం

- మిగతా2లో

ఎంపీ పుట్టా మహేష్ పై టీడీపీ అధిష్టానం సీరియస్...

మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో ఎంపీ పుట్టా అరెస్ట్

ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై సీఎం చంద్రబాబు ఆగ్రహం

పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆదేశం

వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వాలని పల్లాకు సూచన

ఇలాంటివి ఉపేక్షించేది లేదని చంద్రబాబు స్పష్టం

మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో అరెస్టైన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ పై టీడీపీ అధిష్టానం సీరియస్ అయ్యింది. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనపై వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వాలని ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కు ఆదేశాలు జారీ చేశారు చంద్రబాబు. డ్రగ్స్ కేసులో మహేష్ పట్టుబడ్డ అంశంపై

- మిగతా2లో

పాంచ్‌జన్యం మోగింది

పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల షెడ్యూలు విడుదల

- నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల
- పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు
- పశ్చిమ బెంగాల్‌లో రెండు దశల్లో, మిగిలిన చోట్ల ఒకే విడతలో పోలింగ్
- ఏప్రిల్ నెలలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తి
- అన్ని ప్రాంతాల ఓట్ల లెక్కింపు మే 4వ తేదీన..

- మిగతా2లో

కాలర్ పట్టుకుంటామని కాళ్లమీద పడ్డారు

జగన్‌పై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజం

అధికారంలోకి వస్తే కేంద్రం కాలర్ పట్టుకుని ప్రత్యేక హోదా సాధిస్తామని మాజీ సీఎం, వైకాపా అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి చెప్పారని, ముఖ్యమంత్రి అయ్యాక ప్రధాని మోదీ కాళ్లమీద పడ్డారని ఏపీపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధం అమలు చేస్తామని చెప్పి, ఏపీని లిక్కర్ మాఫియాకు అడ్డాగా మార్చారని ఆరోపించారు

- మిగతా2లో

సినిమా అంటే నాకు ప్రాణం... అందుకే దాన్ని ఎప్పటికీ వదల్లేను

- హైదరాబాదులో ఉస్తాద్ భగత్ సింగ్ ప్రీ రిలీజ్ ఈవెంట్
- మనసు విప్పి మాట్లాడిన పవన్ కల్యాణ్
- సినిమా తనకు అన్నం పెట్టిందని, దాన్ని ఎప్పటికీ వదల్లేనని వెల్లడి
- అన్ని సినిమాల విజయాలను మనస్ఫూర్తిగా కోరుకుంటానన్న పవర్ స్టార్
- హరీశ్ శంకర్ నమ్మకంతోనే ఈ సినిమా ఇంత బాగా వచ్చిందని స్పష్టీకరణ

"నాకు తెలిసిన, నేను చూసిన హీరో ఒక్కరే.. అది అన్నయ్య చిరంజీవి గారే" అంటూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. తన అన్నయ్యే తనకు స్ఫూర్తి అని పునరుద్ఘాటించారు. 'ఉస్తాద్ భగత్ సింగ్'

- మిగతా2లో

ఇదిగో.. నా చేతికి ఐదు వేళ్లు ఉన్నాయి

- చేతి వేళ్లు చూపిస్తూ... తన మరణ వదంతులను కొట్టిపారేసిన నెతన్యాహు
- ఇరాన్ దాడుల్లో మరణించారన్న వదంతులపై నెతన్యాహు స్పందన
- కొత్త వీడియో విడుదల చేసి తాను క్షేమంగా ఉన్నానని వెల్లడి
- తనకు ఆరు వేళ్లున్నాయన్న ప్రచారాన్ని సైతం ఖండన
- నెతన్యాహును అంతమొందిస్తామన్న ఇరాన్ హెచ్చరికల నేపథ్యంలో ఘటన

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన మరణంపై వ్యాపిస్తున్న వదంతులను స్వయంగా ఖండించారు. ఇరాన్ దాడుల్లో తాను చనిపోయినట్లు వస్తున్న వార్తలకు చెక్ పెడుతూ ఓ కొత్త వీడియోను విడుదల చేశారు. ఇందులో ఆయన తన చేతిని చూపిస్తూ, "నాకు ఐదు వేళ్లే ఉన్నాయి" అని చెప్పి, ఇటీవలి వీడియోలో ఆరు వేళ్లు ఉన్నాయన్న ప్రచారాన్ని కూడా సరదాగా కొట్టిపారేశారు. ఓ కాఫీ షాపులో కాఫీ ఆర్డర్ చేస్తూ కనిపించిన నెతన్యాహు, తన మరణవార్తలపై వ్యంగ్యంగా స్పందించారు. "తనకేమీ కాలేదని, ప్రాణాలు పోయినా తన దేశాన్ని ప్రేమిస్తూనే ఉంటానని అన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఇజ్రాయెల్ ప్రజల ధైర్యాన్ని ఆయన ప్రశంసించారు. ఇటీవల ఇరాన్ జరిపిన దాడుల్లో నెతన్యాహు మరణించారంటూ సోషల్ మీడియాలో తీవ్రంగా ప్రచారం జరిగింది. దీనిపై ఆయన కార్యాలయం గతంలోనే స్పందించి, అవన్నీ అసత్యాలని, ప్రధాని క్షేమంగా ఉన్నారని ప్రకటించింది. ఇప్పుడు నెతన్యాహు స్వయంగా వీడియో ద్వారా స్పష్టత ఇచ్చారు. మరోవైపు, ఇజ్రాయెల్ ప్రధానిని వెంటాడి అంతమొందిస్తామని ఇరాన్ మిలిటరీ ఆదివారం హెచ్చరించింది.

- మిగతా2లో

బతికుంటే వేటాడి చంపేస్తం ఐఆర్జీసీ వార్నింగ్

టెల్ అవీవ్: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్నెతన్యాహు మరణించలేదంటూ ఆ దేశ పీఎంఓ రిలీజ్ చేసిన ప్రకటనపై ఇరాన్ స్పందించింది. ఒకవేళ ఆయన బతికే ఉంటే వేటాడి మరీ చం పేస్తామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) హెచ్చరించింది. నెతన్యాహు నేరస్తుడైన జియోనిస్ట్ ప్రధానమంత్రి. ఒకవేళ అతను ప్రాణాలతో ఉంటే వేటాడి చంపేస్తం' అని హెచ్చరించింది. మరోవైపు నెతన్యాహు చేతికి ఆరువేళ్లు ఉన్నాయని.. అది ఏఐ వీడియో అని ఇరాన్ వాదిస్తున్న విషయం తెలిసిందే.

ఇరాన్‌పై నిప్పుల వాన

దుబాయ్, కైరో: ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దళాలు నిప్పుల వాన కురిపించాయి. ఇస్ఫహాన్, షిరాజ్ నగరాలపై భారీగా విరుచుకుపడ్డాయి. ఇస్ఫహాన్‌లో పారిశ్రామిక ప్రాంతంపై దాడులు జరిగాయి. దీంతో 15 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. అటు ఇరాన్.. ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. యుద్ధం ముగింపునకు ఇరాన్ విధించిన షరతులు అంగీకారయోగ్యంగా లేవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. మరోవైపు తాము కాల్పుల విరమణను కోరలేదని ఇరాన్ ప్రకటించింది.

ఇస్ఫహాన్ ప్రావిన్సులో ఆదివారం భారీ దాడులు జరిగాయి. 15 మంది మరణించారు.

ఇరాన్ దక్షిణ ప్రాంతంలో ఉన్న షిరాజ్ నగరంపై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు చేశాయి. అక్కడి క్షిపణి కేంద్రంపై విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో పలు నివాసాలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు.

లెబనాన్‌లోని దహియే, బీరుట్ శివార్లపై దాడులు జరిగాయి. దీంతో ఆ ప్రాంతాల్లో దట్టమైన పొగ అలముకుంది. ఇజ్రాయెల్ దాడుల కారణంగా లెబనాన్‌లో 8,31,000 మంది నిరాశ్రయులయ్యారు.

లెబనాన్‌లోని హెజ్‌బొల్లా కమాండ్ కేంద్రాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. రాకెట్ ప్రయోగ కేంద్రాలనూ నాశనం చేశామని వెల్లడించింది.

ఇప్పటిదాకా తమ దేశంలో 153 ఆరోగ్య కేంద్రాలు ధ్వంసమయ్యాయని ఇరాన్ వెల్లడించింది. కెర్మన్‌షా, ఇస్ఫహాన్‌లో అధికంగా వైద్య వ్యవస్థలు ధ్వంసమయ్యాయని వివరించింది.

ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం ధ్వంసమైంది.

గల్ఫ్ దేశాలపై..

గల్ఫ్ దేశాలపై ఆదివారం క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వంటి దేశాలు ముందుగానే ప్రజలు బయటకు రావొద్దని సూచించాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) 50వ విడత క్షిపణులను ప్రయోగించింది. పశ్చిమాసియాలోని ఫ్యాక్టరీలను ఖాళీ చేయాలని అమెరికాను హెచ్చరించింది. సమీపంలోని ప్రజలు ఖాళీ చేయాలని సూచించింది.

ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో ఉన్న నీ బ్రాక్, రమత్ గన్ ప్రాంతాలపై రాకెట్ దాడులు జరిగాయి. ఒకరు గాయపడ్డారు. టెల్ అవీవ్ సెంట్రల్ సిటీపైకీ రాకెట్లు దూసుకొచ్చాయి. ఈ ఘటనల్లో ఇద్దరు గాయపడ్డారు. ఐలత్‌పై ప్రయోగించిన క్షిపణి క్లస్టర్ బాంబును మోసుకొచ్చింది. దాని శకలాలు పట్టణమంతా పడ్డాయి. ఇజ్రాయెల్‌లో 24 గంటల్లో 108 మంది గాయపడ్డారు.

ఇజ్రాయెల్‌లోని లహవ్ 433 ప్రత్యేక పోలీస్ యూనిట్, గిలత్ డిఫెన్స్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ సెంటర్‌పై దాడి చేశాయని ఇరాన్ వెల్లడించింది.

రియాద్ గగనతలంలోకి దూసుకొచ్చిన 4 డ్రోన్లను సౌదీ అరేబియా కూల్చివేసింది. అల్–ఖర్జ్ దిశగా దూసుకొచ్చిన 6 బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకుంది.

ఇజ్రాయెల్‌కు సహకరిస్తున్న 20 మంది పౌరులను ఇరాన్ అరెస్టు చేసింది.

యూఏఈలోని అల్ ధఫ్రా అమెరికా వైమానిక స్థావరంపైకి ఇరాన్ 10 క్షిపణులను, భారీగా డ్రోన్లను ప్రయోగించింది. యుద్ధంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ 19 మంది భారతీయులుసహా 35 మందిని అరెస్టు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

ఇజ్రాయెల్‌లోని సైనిక ప్రాంతాలపై నాలుగు రాకెట్లను ప్రయోగించినట్లు హెజ్‌బొల్లా ప్రకటించింది.

ఇరాక్‌లో కూలిపోయిన అమెరికా విమానంలో మరణించిన వారి వివరాలు వెల్లడయ్యాయి. వారిలో మేజర్ జాన్ ఎ క్లిన్నర్ (33), కెప్టెన్ అరియానా జి సవినో (31), టెక్ సార్జెంట్ ఆష్లీ బి ప్రూట్ (34), కెప్టెన్ సెథ్ ఆర్ కోవల్ (38), కెప్టెన్ కర్టిస్ జే ఆంగ్స్ (30), టెక్ సార్జెంట్ టైలర్ హెచ్ సిమన్స్ (28) ఉన్నారు.

ఇరాక్ రాజధాని బాగ్దాద్ విమానాశ్రయంవద్ద ఉన్న అమెరికా సైనిక స్థావరంపై వరుస డ్రోన్ దాడులు జరిగాయి. ఐదు డ్రోన్లు రాగా మూడింటిని కూల్చివేశారు.

పాక్, అఫ్గాన్‌లకు వలస

యుద్ధం నేపథ్యంలో ఇరాన్ ప్రజలు సురక్షితంగా భావిస్తున్న తమ దేశంలోని ఉత్తర ప్రావిన్సులకు వలస వెళ్తున్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి అఫ్గానిస్థాన్‌కు 32,000 మంది, పాకిస్థాన్‌కు 4,000 మంది వలస వెళ్లారు. ఇరాక్‌తో సరిహద్దులను మూసివేశారు.అమెరికాకు అనుమతివ్వని స్విట్జర్లాండ్: అమెరికా నిఘా విమానాలకు స్విట్జర్లాండ్ అనుమతి నిరాకరించింది. మానవతా, వైద్య సహాయానికి సంబంధించిన విమానాలకు అనుమతిస్తామని ప్రకటించింది.

చమురు ఎగుమతులపై చైనా నిషేధం

యుద్ధం నేపథ్యంలో చమురు ఎగుమతులను చైనా నిషేధించింది. దీంతో ఆస్ట్రేలియా విమాన ప్రయాణికులను ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. చైనా నిర్ణయంతో ఆస్ట్రేలియాలో ఇంధన కొరత తలెత్తింది. ఫలితంగా విమాన ఛార్జీలు ఆకాశాన్నంటాయి. అత్యవసర నిధులకు ఇజ్రాయెల్ ఆమోదం: యుద్ధం నేపథ్యంలో 827 మిలియన్ డాలర్ల అత్యవసర నిధుల విడుదలకు ఇజ్రాయెల్ ఆమోదం తెలిపింది. ఈ నిధులతో సైన్యం ఆయుధాలను సమకూర్చుకోనుంది.

అమెరికా వెళ్లిపోతేనే శాంతి: పెజెష్కియాన్

పశ్చిమాసియా ప్రాంతం భద్రంగా ఉండాలంటే అమెరికా అక్కడ ఉండకూడదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు.

గల్ఫ్ దేశాలతో ఉద్రిక్తతల తగ్గింపునకు ప్రయత్నాలు: ఇరాన్

గల్ఫ్ దేశాలతో ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. ప్రయత్నాలు ఎంతవరకు వచ్చాయనేది మాత్రం ఆయన వెల్లడించలేదు. అదే సమయంలో అమెరికావైపు నుంచి కాల్పుల విరమణను తాము కోరలేదని తేల్చి చెప్పారు. చర్చలకు కూడా విజ్ఞప్తి చేయలేదని పేర్కొన్నారు. విదేశీ దురాక్రమణదారులను పంపించివేయాలని ఆయన గల్ఫ్ దేశాలకు పిలుపునిచ్చారు. యుద్ధ నౌకలను పంపాలని మిత్ర దేశాలను ట్రంప్ కోరడం బిచ్చమెత్తుకోవడమేనని వ్యాఖ్యానించారు. తాము కేవలం సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకుంటున్నామని తెలిపారు. గల్ఫ్ దేశాల్లోని జనావాసాలపై ఎవరు దాడి చేశారో తేల్చడానికి కమిటీ వేసేందుకు సిద్ధమని వెల్లడించారు. కేవలం అమెరికా, ఇజ్రాయెల్ నౌకలకే హర్మూజ్‌ను మూసివేసినట్లు తెలిపారు. ఇతర దేశాల నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని చెప్పారు. అయితే భయంతో అవి రావడం లేదని పేర్కొన్నారు. తమ దేశంలోని యురేనియం మట్టిలో కూరుకుపోయిందని, దానిని వెలికితీసే ప్రణాళికలేవీ లేవని స్పష్టం చేశారు.

హర్మూజ్ జల సంధిని మూసివేయలేదని ఐఆర్‌జీసీ నేవీ కమాండర్ అలీరెజా తంగ్సిరి తెలిపారు.

తమ డ్రోన్లను పోలిన వాటిని తయారుచేసి గల్ఫ్ దేశాలపై ప్రయోగించి తాము బాంబులు వేసినట్లుగా అమెరికా–ఇజ్రాయెల్ చూపుతున్నాయని ఇరాన్ ఆరోపించింది. 136 షాహెద్ డ్రోన్లను పోలిన లూకాస్ డ్రోన్లతో సంబంధం లేని లక్ష్యాలపై దాడులు చేస్తున్నాయని పేర్కొంది.

ఆ ఇద్దరి వరకూ దర్యాప్తు వెళ్లాలి

-మొదటిపేజీ తరువాయి

ద్వారా పలు విషయాలు మీడియాకు తెలిపారు.

'నేను లేవనెత్తిన అనేక అంశాలను పట్టించుకోకుండా కేవలం కిరణ్‌యాదవ్ (ఏ2 సునీల్‌యాదవ్ సోదరుడు), అర్జున్‌రెడ్డి మధ్య ఫోన్ సంభాషణకే సీబీఐ దర్యాప్తు పరిమితమైంది. కిరణ్ యాదవ్, అర్జున్‌రెడ్డి ఇచ్చిన స్టేట్మెంట్లను రాసుకుని వచ్చారే తప్ప దర్యాప్తు అధికారులు లోతైన పరిశీలన చేయలేదు' అని సునీత అన్నారు.

'లోతైన విచారణ జరిగితే హత్యకు మూలాల వరకు వ్యవహారం వెళ్లేది. వివేకా హత్యకు ముందు.. తర్వాత కిరణ్‌యాదవ్ కదలికలు, ఆయన సంభాషణలు పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. కిరణ్‌యాదవ్ అర్ధరాత్రి ఉమాశంకర్‌రెడ్డి భార్యతో 25 సార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు రికార్డులు ఉన్నాయి' అంటూ ఆధారాలు చూపించారు.

'వివేకా గుండెపోటుతో చనిపోయారని ముందుగా సాక్షి టీవీలో వేశారు. కానీ కడప నుంచి ఆ ఛానల్ రిపోర్టర్ శ్రీనివాస్ చెప్పినదానికి, వేసిన వార్తలకు తేడాలున్నాయి. సాక్షి టీవీ ఎడిటర్ నేమాని భాస్కర్ ఆ రోజు నాలుగుసార్లు చైర్‌పర్సన్ భారతిరెడ్డితో ఫోన్లో మాట్లాడారు. ఈ కేసులో అనుమానాలు నివృత్తి కాకుండానే సీబీఐ దర్యాప్తు ముగిసిందంటూ అదనపు ఛార్జిషీట్ వేయడమేంటి? దర్యాప్తు సంస్థలు సక్రమంగా పనిచేస్తాయా, లేవా అనడానికి ఈ కేసు ఓ ఉదాహరణ. అయినప్పటికీ, నేను న్యాయపోరాటం కొనసాగిస్తాను. కీలక నిందితుల విషయంలో చెప్పింది వినడమే తప్ప సీబీఐ లోతుగా విచారణ చేపట్టలేదు. నిందితుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలను సీరియస్‌గా తీసుకోలేదు' అని ఆమె వివరించారు.

సమాచారం వచ్చిన సమయంపై సందేహాలు

'హత్యకు ముందు, తర్వాత కిరణ్‌యాదవ్ అనేక మందితో ఫోన్‌లో మాట్లాడారు. సాక్షి ఛానల్‌లో గుండెపోటుతో వివేకా మృతి అని రావడానికి ఒక నిమిషం ముందే కిరణ్ యాదవ్.. అర్జున్‌రెడ్డికి 'వివేకం సర్ డైడ్' అనే సందేశాన్ని రాత్రి 1.14 గంటలకు పంపినట్లు తొలుత భావించినా, ఫోరెన్సిక్ పరీక్షల ప్రకారం ఆ సమయం యూటీఐలో నమోదైందని సీబీఐ తెలిపింది. భారత కాలమానానికి మారిస్తే అది ఉదయం 7.12 గంటలకు పంపినట్లు తేలింది. తాను సాక్షి టీవీలో గుండెపోటు వార్త చూసి అర్జున్‌రెడ్డికి ఉదయం 7.12 గంటలకు సందేశం పంపినట్లు కిరణ్‌యాదవ్ చెప్పారు. అయితే సాక్షి టీవీలో ఆ వార్త 7.13 గంటలకు ప్రసారమైంది. సాక్షి ఛానల్‌లో 10 గంటల తర్వాత గుండెపోటు కాదు, హత్యపై అనుమానాలున్నాయని ప్రసారం చేశారు. దీనిపై తీగ లాగితే డొంక కదిలేది కదా? 13 లక్షల రికార్డులను రాత్రింబవళ్లు పరిశీలించి కొన్ని సాక్ష్యాలను ఇటీవల నేను న్యాయస్థానానికి, సీబీఐకి అప్పగించాను' అని సునీత తెలిపారు.

సాక్షుల వాంగ్మూలాల్లో విరుద్ధమైన సమాచారం

'హత్య జరిగిన రాత్రి నిందితుడు సునీల్‌యాదవ్ ఎక్కడ ఉన్నారన్న విషయమై సాక్షుల వాంగ్మూలాల్లో తేడా ఉంది. సునీల్ తల్లి సావిత్రియాదవ్ మొదట ఇచ్చిన వాంగ్మూలంలో అతడు ఆ రాత్రి ఇంటినుంచి రెండుసార్లు బయటకు వెళ్లి వేకువజామున 4 గంటలకు తిరిగొచ్చాడని చెప్పారు. సునీల్ రాత్రంతా ఇంట్లోనే ఉన్నాడని, అతని తల్లి ఇచ్చిన మొదటి వాంగ్మూలం ఒత్తిడితో తీసుకున్నదని తాజాగా కిరణ్‌యాదవ్ చెప్పారు.

ఎంపీ పుట్టా మహేశ్ కు టీడీపీ షోకాజ్ నోటీసు

-మొదటిపేజీ తరువాయి

ఐదు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని స్పష్టం చేస్తూ షోకాజ్ నోటీసు జారీ చేసింది.ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం పుట్టా మహేశ్ కు అధికారికంగా నోటీసు పంపారు. మార్చి 14వ తేదీన మోయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన ఘటన, ఆ తర్వాత మీడియాలో వచ్చిన కథనాలను పార్టీ అధిష్ఠానం చాలా సీరియస్‌గా తీసుకుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ పరిణామాలు పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగించే విధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు."ఈ అంశంపై సమగ్ర నివేదిక వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని పార్టీ మిమ్మల్ని ఆదేశిస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించి మీ లిఖితపూర్వక వివరణను 5 రోజుల్లో పార్టీకి అందజేయాలి" అని నోటీసులో పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పుట్టా మహేశ్ ఇచ్చే వివరణను పరిశీలించిన తర్వాత పార్టీ అధిష్ఠానం తదుపరి చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

మా డ్రోన్ సాంకేతికతను అమెరికా అడిగింది

-మొదటిపేజీ తరువాయి

మధ్యవర్తిత్వంలో జరగబోయే త్రైపాక్షిక శాంతి చర్చల కోసం ఉక్రెయిన్ సిద్ధంగా ఉందన్నారు. అమెరికాలో ఈ చర్చలు జరగాలని వాషింగ్టన్ ప్రతిపాదించిందని, అక్కడకు తమ ప్రతినిధులను పంపడానికి రష్యా సుముఖంగా లేదని జెలెన్‌స్కీ తెలిపారు. రష్యా నుంచి అంగీకారం వచ్చిన తర్వాత, అమెరికా స్పందన మేరకు చర్చలు జరుగుతాయన్నారు.

28 డ్రోన్లను కూల్చివేశాం: రష్యా

మరోవైపు మాస్కోపైకి ఆదివారం ఉక్రెయిన్ ప్రయోగించిన 28 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ప్రకటించింది. శనివారం జరిగిన ఇదే తరహా దాడిలో 47 డ్రోన్లను నేలరాల్చినట్లు తెలిపింది.

సినిమా అంటే నాకు ప్రాణం... అందుకే దాన్ని ఎప్పటికీ వదల్లేను

-మొదటిపేజీ తరువాయి

చిత్ర గ్లింప్స్‌ను చూసి అభినందిస్తూ చిరంజీవి, రామ్ చరణ్ చేసిన ట్వీట్లకు ఆయన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో అంగరంగ వైభవంగా జరిగిన చిత్ర ప్రీ–రిలీజ్ వేడుకలో పవన్ ప్రసంగించారు.

"ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీ రిలీజ్ వేడుకకు వచ్చిన, నా గుండెల్లో స్థానం ఉన్న మీ అందరికీ, టీవీలో ఈ కార్యక్రమాన్ని చూస్తున్న తెలుగు ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. ఈ వేడుకకు మీ ఆశీస్సులు అందించడానికి వచ్చినందుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.ఇందాక సుమా గారు మాట్లాడుతూ నన్ను గతకాలం నాటి హీరో అన్నట్టు మాట్లాడారు. ఈ మధ్యనే 'ఓజీ' వచ్చిందనే విషయాన్ని మీరు మర్చిపోయినట్టున్నారు. నేను రెగ్యులర్‌గా సినిమాలు చేయకపోవడం వల్ల నన్ను ఇలా వెనక్కి నెట్టడం భావ్యం కాదని బల్లగుద్ది మరీ చెబుతున్నాను. సరదాగా అంటున్నాను కానీ, సినిమా అంటే నాకు ప్రాణం. నాకు అన్నం పెట్టింది సినిమా. ఈ రోజు ప్రజలకు సేవ చేసే గుర్తింపును ఇచ్చింది కూడా సినిమానే. అందుకే సినిమాను వదల్లేను. నా నిర్మాతలు, దర్శకులు, రచయితలు బాగుండాలని కోరుకుంటాను. సినిమా కలెక్షన్ల గురించి నేను ఎప్పుడూ పట్టించుకోలేదు. నేను తెలుగు సినిమా, తమిళ సినిమా అని చూడను, భారతీయ చిత్ర పరిశ్రమగానే భావిస్తాను.నా హీరో అంటే ఒకే ఒక్కరు... మెగాస్టార్ చిరంజీవి గారు. అలాంటి అన్నయ్య, ఈ రోజు 'ఉస్తాద్ భగత్ సింగ్' ట్రైలర్ చూసి ట్వీట్ చేసినందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అలాగే రామ్ చరణ్, 'పెద్ది' దర్శకులు బుచ్చిబాబు గారికి కూడా ధన్యవాదాలు.ఒక సినిమాను మొదలుపెట్టేటప్పుడు అద్భుతంగా రావాలనే అందరం కోరుకుంటాం. కానీ ఆ తర్వాత ఎన్నో అడ్డంకులు, ఒడిదొడుకులు ఎదురవుతాయి. వాటన్నింటినీ దాటుకుని విజయం సాధించడం చాలా కష్టం. నేను ఒకసారి దర్శకుడిని నమ్మితే, గుడ్డిగా నమ్మేస్తాను. ఏం చేయమంటే అది చేస్తాను. హరీశ్ శంకర్ మొదట ఒక కథ చెప్పారు, కానీ అది ముందుకు వెళ్లలేదు. ఆ తర్వాత కథ మారింది, మధ్యలో కొవిడ్ వచ్చింది, నేను రాజకీయాల్లోకి వెళ్లాను. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక, నా విధులకు ఇబ్బంది కలగకుండా పక్కా ప్రణాళికతో ఈ సినిమా చేశాం.

ఇదిగో.. నా చేతికి ఐదు వేళ్లు ఉన్నాయి

-మొదటిపేజీ తరువాయి

చిన్నారుల మృతికి కారణమైన నెతన్యాహును వదిలిపెట్టేది లేదని స్పష్టం చేసింది. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వదంతులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తన ఆరోగ్యం, భద్రతపై వస్తున్న ఊహాగానాలకు నెతన్యాహు ఈ వీడియోతో ముగింపు పలికినట్లయింది.

అమరావతిలో నేడు అమరజీవి విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి

తయారీకి 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్‌ను వినియోగించారు. ప్రాజెక్టులో భాగంగా రెండో దశలో ఇక్కడ ఒక మ్యూజియం, ఫోటో గ్యాలరీ, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటివి నిర్మించనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడకు బయలుదేరి వెళతారు.సాయంత్రం 5:40 గంటలకు విజయవాడలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ముస్లిం మైనారిటీ సోదరులకు శుభాకాంక్షలు తెలిపి, వారితో కలిసి ఆయన ఇఫ్తార్ స్వీకరిస్తారు.

ఎంపీ పుట్టా మహేష్ పై టీడీపీ అధిష్టానం సీరియస్...

-మొదటిపేజీ తరువాయి

నివేదిక ఇవ్వాలని ఆదేశించారు చంద్రబాబు. డ్రగ్స్ వంటి ఘటనల్లో ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వ్యక్తులు , నేతల బలహీనతలు, తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వనని పేర్కొన్నారు చంద్రబాబు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి వివరణ ఇవ్వాలని, ఈ అంశంపై సమగ్ర నివేదిక వచ్చే వరకు పుట్టా మహేష్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది టీడీపీ అధిష్టానం.తనపై వచ్చిన ఆరోపణలకు ఐదు రోజుల్లో లిఖితపూర్వక వివరణను పార్టీకి అందించాలని సూచించింది. మహేష్ వివరణ ఆధారంగా పార్టీ అధిష్టానం జరిగిన ఘటనపై అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొంది పార్టీ అధిష్టానం.

కాలర్ పట్టుకుంటామని కాళ్లమీద పడ్డారు

-మొదటిపేజీ తరువాయి

. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆదివారం ఆమె పర్యటించారు. బొబ్బిలి మండలం పారాది, కొమరాడ మండలం డంగభద్రలో ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన జలయజ్ఞం పనులు కూడా జగన్ పూర్తి చేయలేదన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పీఎం కిసాన్‌తో కలిపి ఇస్తున్నారని ఆరోపించారు. ఎన్డీయే తీసుకొస్తున్న కొత్త వీబీ జీరామ్‌జీ చట్టం అమల్లోకి వస్తే రాష్ట్రానికి గుండుసున్నానే మిగులుతుందని షర్మిల అన్నారు. కొత్త పథకంలో రాష్ట్రం రూ.5 వేల కోట్లు కేటాయించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం ఇంత మొత్తాన్ని కేటాయించగలదా అని ప్రశ్నించారు. డ్రగ్స్ పార్టీలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ దొరకడం సిగ్గుచేటని, వెంటనే ఆయన్ను పదవి నుంచి తొలగించి, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని తెదేపాను డిమాండ్ చేశారు. డ్రగ్స్ పరీక్షలో పాజిటివ్ వచ్చిన నేపథ్యంలో చంద్రబాబు ఏం చర్యలు తీసుకుంటారో చూడాలన్నారు.

పాంచ్‌జన్యం మోగింది

దేశంలో మరోసారి ఎన్నికల నగారా మోగింది. నాలుగు కీలక రాష్ట్రాలు, ఓ కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ పోరుకు ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకటించింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరిల్లో ఏప్రిల్ 9న ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. తమిళనాడులో వచ్చే నెల 23న ఒకే దశలో ఓటింగ్ పూర్తికానుంది. దేశవ్యాప్తంగా అత్యంత ఆసక్తి రేపుతున్న పశ్చిమ బెంగాల్‌లో రెండు విడతల్లో (ఏప్రిల్ 23న 152 స్థానాలకు, 29న 142 సీట్లకు) పోలింగ్ జరగనుంది. వీటన్నింటి ఫలితాలు మే 4న వెలువడతాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి దిల్లీలో ఆదివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. షెడ్యూలు ప్రకటనతో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్లయింది. మొత్తంగా వీటిలో 824 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. మరోవైపు– గోవా, కర్ణాటక, నాగాలాండ్, త్రిపురల్లోని 5 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9న.. గుజరాత్, మహారాష్ట్రల్లోని 3 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటి ఫలితాలూ మే 4న వెలువడతాయి. కేరళ, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికలకు నోటిఫికేషన్ సోమవారం విడుదలవుతుంది. తమిళనాడు ఎన్నికలతోపాటు బెంగాల్‌లో తొలి విడతకు ఈ నెల 30న, బెంగాల్ రెండో విడతకు ఏప్రిల్ 2న నోటిఫికేషన్ జారీ చేస్తారు. సీఈసీ పదవి నుంచి తనను తప్పించేందుకు విపక్షాలు పార్లమెంటులో తీర్మానం కోరడంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు జ్ఞానేశ్ కుమార్ స్పందించలేదు.

పశ్చిమ బెంగాల్‌లో వరుసగా నాలుగోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు, సీఎం మమతాబెనర్జీ పట్టుదలతో ఉండగా.తమిళనాడులో అధికారాన్ని నిలబెట్టుకోవాలని డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ కృషిచేస్తున్నారు. అస్సాంలో భాజపా, కేరళలో ఎల్‌డీఎఫ్ హ్యాట్రిక్ గెలుపుపై కన్నేశాయి. బెంగాల్‌లో భాజపా.. తమిళనాట అన్నాడీఎంకే.. కేరళ, అస్సాంల్లో కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో చావోరేవో అన్నంతగా పోరాడటం ఖాయంగా కనిపిస్తోంది. బెంగాల్‌లో తృణమూల్–భాజపా, అస్సాంలో భాజపా–కాంగ్రెస్, కేరళలో ఎల్‌డీఎఫ్–యూడీఎఫ్, తమిళనాడులో డీఎంకే–ఏఐఏడీఎంకే, పుదుచ్చేరిలో ఎన్డీయే–ఇండియా కూటమిల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారడం దాదాపు సంప్రదాయంగా మారిన కేరళలో.. గత ఎన్నికల్లో పరిస్థితి మారిపోయింది. పినరయి విజయన్ నేతృత్వంలో సీపీఎం కూటమి (ఎల్‌డీఎఫ్) వరుసగా రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈసారి దాన్ని గద్దె దించాలని కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సర్వశక్తులూ ఒడ్డుతోంది. తమిళనాడులో వరుసగా రెండోసారి గెలిచి ఇదివరకు జయలలిత నెలకొల్పిన రికార్డును సమం చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఉవ్విళ్లూరుతున్నారు. ఇదివరకు కరుణానిధి–జయలలితల మధ్య హోరాహోరీ నెలకొన్నప్పుడు ఆ రాష్ట్రంలో అయిదేళ్లకోసారి అధికారం మారే సంప్రదాయం కొనసాగేది. అయితే 2011, 2016 ఎన్నికల్లో జయలలిత నేతృత్వంలో ఏఐఏడీఎంకే వరుసగా రెండుసార్లు అధికారం చేపట్టి.. ఆ సంప్రదాయాన్ని చెరిపేసింది. ఎన్డీయే కూటమిలో ఉన్న ఏఐఏడీఎంకే.. సినీనటుడు విజయ్ నేతృత్వంలో ఏర్పడిన టీవీకే పార్టీని తమతో కలుపుకోవాలని వ్యూహాలు రచిస్తోంది. బెంగాల్‌లో తృణమూల్ ఓడితే.. ఆ పార్టీ మనుగడ ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. అక్కడ ఒకసారి అధికారం కోల్పోతే పుంజుకోవడం కష్టమని వామపక్షాల చరిత్రను బట్టి తెలుస్తోంది. అస్సాంలో కాంగ్రెస్ గెలవకపోతే.. వరుసగా మూడోసారి పరాజయాన్ని మూటగట్టుకున్నట్లవుతుంది. పుదుచ్చేరిలో గెలుపోటములు జాతీయ రాజకీయాలపై పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదు.

మోదీ సుడిగాలి పర్యటనలు

భాజపా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ఎన్నికలు జరగనున్న ఈ రాష్ట్రాల్లో ప్రధాని మోదీ ఇప్పటికే ఇప్పటికే సుడిగాలి పర్యటనలు చేపట్టారు.

పరిటాల శ్రీరామ్ ఔదార్యం.

- పాఠశాల పై కప్పు నిర్మాణానికి ముందు కొచ్చిన శ్రీరామ్.
- గత వైసీపీ ప్రభుత్వంలో దొరిగల్లులో ఆగిపోయిన పాఠశాల నిర్మాణం.
- విద్యార్థుల ఇబ్బందులు చూసి సొంత ఖర్చులతో నిర్మాణానికి ముందు కొచ్చిన శ్రీరామ్.

ధర్మవరం, పెన్ సత్తా, మార్చి 15: నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం ముదిగుబ్బ మండలం దొరిగల్లులో ఓ వివాహ వేడుకకు శ్రీరామ్ హాజరయ్యారు. అదే సమయంలో ఆయన గ్రామంలో వెళ్తున్నప్పుడు ప్రభుత్వ పాఠశాల వద్ద 10 వ తరగతి విద్యార్థులు చెట్ల కింద కూర్చుని చదువుకుంటుండటం గమనించారు. ఎందుకు మీరంతా చెట్ల కింద ఉన్నారని ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆరా తీయగా, పాఠశాలలో భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని వారు సమాధానం ఇచ్చారు. వెంటనే శ్రీరామ్ పాఠశాలను పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022-24 సమయంలో నాడు-నేడు కింద పాఠశాల నూతన భవనాల నిర్మాణాలు చేపట్టారన్నారు. అయితే అప్పట్లో కేవలం గోడలు మాత్రమే నిర్మించి వదిలేశారన్నారు. 160 మంది పిల్లలకు కేవలం నాలుగు గదులే ఉన్నాయని, అవి కూడా అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. గత మూడేళ్లుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు అన్నారు. వెంటనే శ్రీరామ్ ఫోన్ ద్వారా విద్యాశాఖ అధికారులతో మాట్లాడారు. నూతన భవనాల నిర్మాణం ప్రతిపాదనలో ఉందని చెప్పారు. దీంతో శ్రీరామ్ వెంటనే తన సొంత ఖర్చులో పై కప్పు నిర్మిస్తానని గ్రామస్థులకు, విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పాఠశాలకు నిధులు కూడా వచ్చేలా కృషి చేస్తానన్నారు. వెంటనే పై కప్పు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీరామ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు

అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 15:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ, అనకాపల్లి 81 వ వార్డు పరిధిలో సుమారు 3.70 కోట్ల రూ తో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు. ఆదివారం

మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సారధ్యంలో గ్రేటర్ విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర చేతుల మీదగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా త్వరలో పునః ప్రారంభమగు రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం పనులను పరీక్షించారు.

అనకాపల్లి జీవీఎంసీ, రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుండి ఏడి స్కూల్ ఫుల్ బాగ్ రోడ్ సుమారు 50 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, కాలువ నిర్మించుట కొరకు రోడ్డు ప్రారంభోత్సవం.

ఫుల్ బాగ్ రోడ్డు నుండి పూడిమడక రోడ్డు వరకు సుమారు 99 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణం నకు శంకుస్థాపన. మరిడిమాంబ అమ్మవారి గుడి వద్ద జేఎల్ స్కూల్ నుండి ఎన్హెచ్ 16 రోడ్డు వరకు రోడ్డు, కాలవలు, కల్వర్టులు సుమారు 123 లక్షల రూపాయలతో నిర్మాణం నకు శంకుస్థాపన. కొత్తపేట రామాలయం నుండి ఎన్హెచ్ 16 రోడ్డు వరకు రోడ్డు, కాలవలు, కల్వర్టులు సుమారు 93 లక్షల రూపాయలతో నిర్మాణం నకు శంకుస్థాపన కార్యక్రమాలకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో , 81 వ వార్డ్ కార్పొరేటర్ 81 వార్డు కూటమి నాయకులు, పాల్గొన్నారు.

ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేసిన అనిత

పాయకరావుపేట, పెన్ సత్తా, మార్చి 15: నియోజకవర్గం లోని నాలుగు మండలాలు నక్కపల్లి, పాయకరావుపేట, కోటవొరట్ల, ఎస్ రాయవరంలో ఆంధ్రప్రదేశ్ హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత చేతులమీదుగా సుమారు 800 మందికి రంజాన్ తోఫా కిట్లు, ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ నాలుగు మండలాలు మైనార్టీ ముస్లిం సోదర సోదరీమణులు అనిత చేతుల మీదుగా కిట్లు ఇవ్వడం జరిగింది. మైనార్టీ ముస్లింలు సోదరులు పులుపు మేరకు ఆంధ్రప్రదేశ్ నూర్ భాషా దూదేకుల ఫైనాన్సర్స్ కార్పొరేషన్ సొసైటీ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ బిజెపి స్టేట్ సెక్రటరీ షేక్ ఇబ్రహీం భాషా ఈ కార్యక్రమానికి హాజరు అవ్వడం జరిగింది. ముఖ్యంగా తెలుగుదేశం సీనియర్ నాయకుడు కొప్పిశెట్టి వెంకటేశ్వర ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. జిల్లా మైనార్టీ తెలుగుదేశం సెల్ అధ్యక్షులు షేక్ మీరా, మండల మైనార్టీ మోర్చా అధ్యక్షులు షేక్ మదీనా, తెలుగుదేశం నాయకులు, బిజెపి నాయకులు, జనసేన కార్యకర్తలు, ముస్లిం మైనార్టీ కార్యకర్తలు, అలాగే సీనియర్ నాయకుడు తెలుగుదేశం గొలగాని రామకృష్ణ లక్ష్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురి కావద్దు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

- విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమయానికి హాజరు కావాలి.
- జిల్లాలో ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 15 : ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికావద్దని, పరీక్షా కేంద్రానికి సమయానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. నేటి (సోమవారం) నుండి పదవ తరగతి పరీక్షలు జరగనున్నందున ఆదివారం ఉదయం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జీ వి ఎమ్ సి ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించే నిమిత్తం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ పరిశీలించి, వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులతో పాటు పరీక్ష విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బంది పదవ తరగతి పరీక్షల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పరీక్షలను సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఇతర శాఖల సమన్వయంతో పని చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.

అనంతరం కశింకోటలో గల జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాలను సందర్శించి పదవతరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి పరీక్షలు పై ఎవ్వరు ఆందోళన చెందకుండా నిర్భయంగా పరీక్షలు వ్రాయమని విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించి శుభాకాంక్షలు తెలియజేసారు. విద్యార్థులను అడిగిన ప్రశ్నలకు వారు ఇచ్చిన సమాధానములు విని జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

కసింకోటలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనం (చిల్డ్రన్ హోమ్)ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వారికి మెనూ ప్రకారము ఆహారం అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వారికి అందుతున్న ఇతర సదుపాయాల గురించి విద్యార్థులతో నేరుగా చర్చించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యా శాఖధికారి గిడ్డి అప్పారావు

నాయుడు, డి ఎల్ డి ఓ మంజుల వాణి, ఎమ్ డి ఓ, ఎమ్ ఆర్ ఓ, ప్రధానోపాధ్యాయులు స్వర్ణకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిడమానూరు నిర్వాసితులకు అండగా కూటమి ప్రభుత్వం.

- ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.

గన్నవరం, పెన్ సత్తా, మార్చి 15:నిడమానూరు ప్రధాన రహదారి వెంబడి బాపిరాజు చెరువు పరిధిలో ఆక్రమణల తొలగింపులో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ నివాస స్థలాలను కేటాయించింది. గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఈ పట్టాలను ఆదివారం విజయవాడ లోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. గత నెలలో నిడమానూరు లోని సర్వే నంబరు 109 లో నిర్మించిన మూడు అక్రమ నివాసాలను పంచాయతీ అధికారులు తొలగించగా, ఆ కుటుంబాలు నివాసం కోల్పోయాయి. ఎమ్మెల్యే ఆదేశాలతో నిడమానూరు టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు బండి నాని కృషితో, ప్రభుత్వం వీరికి విజయవాడ రూరల్ మండలం లోని నున్న గ్రామంలో ఒక్కొక్కరికి 145.2 చదరపు గజాల చొప్పున స్థలాలను మంజూరు చేసింది. లబ్ధిదారులు కోడూరు దుర్గ నాగేశ్వరమ్మ, తిరుమలకొండ వెంకమ్మ, తిరుమల కొండ వెంకట రమణలకు ఈ పట్టాలను అందజేసిన ఎమ్మెల్యే, పేదలకు నివాస స్థలాలు అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరవపల్లి రమేష్, కోనేరు సుభకర్, గరికిపాటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో టిడిపి నాయకులు సేవా గుణాన్ని చాటుకుంటున్నారు.

- సొంత ఖర్చులతో ఇఫ్తార్ విందులు, రంజాన్ తోఫాలు ఇస్తున్నారు.
- అర్బన్ టిడిపి నాయకుల పై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రశంసలు.
- టిడిపి నేత లింగమయ్య ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి,

అనంతపురం, పెన్ సత్తా, మార్చి 15:పవిత్ర మైన రంజాన్ మాసంలో టిడిపి నాయకులు సేవా గుణాన్ని చాటు కుంటున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. రాజీవ్ కాలనీ లోని ప్రియాంక నగర్ లో టిడిపి నేత లింగమయ్య స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు పాల్గొన్నారు. కాలనీకి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికంగా ఉన్న టిడిపి నాయకులు ముస్లిం సోదరులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి తెలుగు మైనార్టీ పక్షపాతిగా ఉంటుందన్నారు. తమ పార్టీ నేతలు కూడా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందులు, రంజాన్ తోఫాలు అందజేస్తున్నారన్నారు. మత సామరస్యాన్ని చాటే విధంగా నాయకులు కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

జిల్లాలో ప్రశాంతంగా జరిగిన లిటరసీ న్యూమరసీ ఎసెస్మెంట్ పరీక్ష జిల్లా కలెక్టర్

అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 15: జిల్లాలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అక్షరాంధ్ర లిటరసీ ప్రోగ్రాంలో భాగంగా లిటరసీ న్యూమరసీ ఎసెస్మెంట్ పరీక్ష ను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ముందుగా అనకాపల్లి పరిధిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని స్వయంగా సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని 24 మండలాలు, 2 మున్సిపాలిటీలు, జీవీఎంసీ జోన్ పరిధిలో మొత్తం 2,478 పరీక్షా కేంద్రాలలో 93,292 మంది అభ్యర్థులకు ఈ పరీక్షను నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించబడగా, జిల్లా లోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, జీవీఎంసీ పరిధిలో నూటికి నూరు శాతం (93,292)హాజరుతో పరీక్షలు విజయవంతంగా నిర్వహించబడ్డాయని పేర్కొన్నారు. జిల్లాను శత శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణను సమర్థవంతంగా సమన్వయంతో విజయవంతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టర్ డి.చిన్ని కృష్ణ, జిఎస్డబ్ల్యూఎస్ అధికారిణి మంజులవాణి, జీవీఎంసీ అనకాపల్లి జోన్ ఏపీడీ వై. సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డ్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

- సంతమామిడి తోట శివాలయం ఓపెన్ షెడ్ ప్రారంభోత్సవం.
- ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్)

గాజువాక, పెన్ సత్తా, మార్చి 15: నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాధం (జగన్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కాశి పాలెం, వడ్లపూడి చెట్టుబలిజ వీధిలో ఉన్న సిసి రోడ్, సీసీ కాలువ శిధిలావస్థకు చేరుకోవడం జరిగిందని, దీనివల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. జీవీఎంసీ నిధులు 19.70 లక్షల సీసీ రోడ్లు, సీసీ కాలవలు సొంత మామిడి తోట శివాలయం షేడ్డుకు 19 98 లక్షలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు విజయరామరాజు, జనసేన అధ్యక్షులు సిరసపల్లి కనకరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్ రాజ్, డీవీ అప్పారావు, కాంద్రేగుల శ్రీనివాస్ నాయుడు, కణితి ఈశ్వరరావు, వై. భాస్కరరావు, జీవీ రమణ, గండిమాన కనకరాజు, శ్రీరామ్ మూర్తి, వెంకట రావు, వేణు, సూర్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు బంటు వీర్రాజు, సతీష్, పద్మావతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రిన్సిపాల్ షేక్ ఫాతిమా

నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 15: మండల కేంద్రంలో నక్కపల్లి కేజీబీవీ గురుకుల కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరంలో వివిధ తరగతుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ షేక్ ఫాతిమా ఆదివారం ప్రకటన ద్వారా తెలిపారు.

ఈ పాఠశాలలో 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 1, ఎనిమిదవ తరగతి లో 1, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపిసి గ్రూపులో 31 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా బడి బయట పిల్లలు, డ్రాప్ అవుట్, సింగిల్ పేరెంట్ విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అలాగే దారిద్య రేఖకు దిగునున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలలో నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థినుల వార్షిక కుటుంబ ఆదాయం1.20 లక్షల లోపు ఉండాలన్నారు. అర్హత కలిగిన విద్యార్థినిలు ఏప్రిల్ 1వ తేదీలోగా కేజీబీవీ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు సమయంలో ఆన్ లైన్ సందేహాలు ఉంటే నేరుగా గురుకుల పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించాలని తెలిపారు.

పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి పెట్టుబడుల సమీకరణ కీలకం.

- జూన్ నాటికి 2.60 లక్షల గృహాల పూర్తి లక్ష్యం
- విశాఖ మెట్రో సాంకేతిక ప్రక్రియలు త్వరలో పూర్తి.
- మూడు సంవత్సరాల్లో ప్రాజెక్ట్ పూర్తికి చర్యలు.
- విలేకరులతో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ

విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 15: పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి పెట్టుబడులను సమీకరించడం, పట్టణ స్థానిక సంస్థల సామర్థ్యాన్ని పెంపొందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో యూవిన్ (అర్బన్ ఇన్వెస్ట్మెంట్ విండో) కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల ప్రతినిధులతో ప్రాంతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి అవసర మైన నిధులను క్యాపిటల్ మార్కెట్ల ద్వారా సమీకరించడం, మున్సిపల్ బాండ్లు, ఇతర పెట్టుబడి అవకాశాలను వినియోగించడం వంటి అంశాల పై ఈ వేదికలో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. పట్టణ స్థానిక సంస్థలు అభివృద్ధి ప్రాజెక్టులను రూపొందించడంలో, ఆర్థిక వనరులను సమీకరించడంలో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు ఈ తరహా వర్క్‌షాప్‌లు ఎంతో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, రవాణా, గృహ నిర్మాణం వంటి కీలక రంగాల్లో బ్యాంకబుల్ ప్రాజెక్టులను సిద్ధం చేయడానికి సాంకేతిక, ఆర్థిక మార్గదర్శనం అందుతుందని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ప్రారంభ మైన గృహ నిర్మాణ ప్రాజెక్టుల్లో ఆలస్యం జరిగినప్పటికీ, వాటిని పూర్తి చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో సుమారు 20 వేలకు పైగా గృహాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ గృహ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే వేలాది ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, జూన్ నెలాఖరు నాటికి సుమారు 2.60 లక్షల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వెల్లడించారు.

రాష్ట్రంలో 90 కు పైగా మున్సిపాలిటీలు, 9 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయని, అభివృద్ధి పనులకు అవసర మైన నిధులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో ఆస్తుల వినియోగం, ఆదాయ వనరుల విస్తరణ వంటి మార్గాలను అన్వేషిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. అన్ని మున్సిపల్ కార్పొరేషన్లకు జాయింట్ కలెక్టర్లను ప్రత్యేక అధికారులుగా నియమించామని చెప్పారు. విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు పై రైడర్స్ సంస్థ అధ్యయనం చేస్తోందని, రెండు నెలల్లో ఆ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం పనులను వేగవంతంగా చేపట్టి మెట్రో ప్రాజెక్టును మూడు సంవత్సరాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ లోని ఔటర్ రింగ్ రోడ్ తరహాలో విశాఖపట్నానికి సెమీ రింగ్ రోడ్ అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు ఈ ప్రాజెక్టును వీఎంఆర్‌డీఏ పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన ఒక రహదారి నిర్మాణానికి అటవీ భూమి అడ్డంకిగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో చర్చించి సమస్యను పరిష్కరించినట్లు మంత్రి వెల్లడించారు.

గత ప్రభుత్వం సెంటు భూమి కేటాయింపుల విషయంలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని, దీని పై విజిలెన్స్ విచారణ కొనసాగుతోందన్నారు. అయితే విచారణ కారణంగా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం ఉండదని మంత్రి స్పష్టం చేశారు.

మాధవధార - సింహాచలం ట్రెకింగ్‌లో ప్లాస్టిక్ రహిత సందేశం



విద్యార్థి లోకానికి ఆదర్శంగా ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ బృందం.

సింహాచలం, పెన్ సత్తా, మార్చి 15:ప్రకృతిని ప్రేమించాలి - పర్యావరణాన్ని కాపాడాలి అనే నినాదంతో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ), ఆర్ఎస్ఎస్ ఆంధ్ర యూనివర్సిటీ విభాగం ఖేలో భారత్ సంయుక్తంగా చేపట్టిన వినూత్న కార్యక్రమం ఆదివారం సింహాచల పుణ్యక్షేత్రంలో ఘనంగా ముగిసింది. ఖేలో భారత్ కన్వీనర్ విజయ్ టీమ్ ఆర్గనైజర్‌గా, సభ్యులు కిరణ్ చందు నేతృత్వంలో సుమారు వందలాది మంది ఏ బి వి పి, ఆర్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం మాధవధార నుండి సింహాచలం వరకు కొండ మార్గంలో ట్రెకింగ్ నిర్వహించారు. కేవలం విహారం కోసం కాకుండా, ప్రకృతి ప్రేమలో ప్లాస్టిక్ నిషేధం అనే ప్రధాన ఉద్దేశంతో ఈ యాత్ర సాగింది. ట్రెకింగ్ మార్గమధ్యంలో భక్తులు విస్మరించిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ఇతర వ్యర్థాలను సేకరిస్తూ, పర్యావరణాన్ని కాపాడాలనే స్పృహను పౌరుల్లో కల్పించారు. సింహాచలం చేరుకున్న ఈ బృందాన్ని వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి జె.వెంకట్రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

నేటి యువత ప్రకృతి పట్ల చూపిస్తున్న ఈ బాధ్యత ఎంతో అభినందనీయం అన్నారు. పవిత్ర మైన పుణ్యక్షేత్రాలను ప్లాస్టిక్ రహితంగా ఉంచడంలో విద్యార్థుల పాత్ర కీలకమైనది. ఈ బృందం చేసిన కృషి ఇతర స్వచ్ఛంద సంస్థలకు మార్గదర్శకం అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ డి.ఇ (ఐ/సీ) రామరాజు, సహాయ కార్యనిర్వహణ అధికారి వాడ్రేవు రమణ మూర్తి, పిఆర్ఓ, నాయుడు, ఇతర ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం

- సింహాచలంలో వైభవంగా గ్రామ తిరువీధి పల్లకి సేవ

సింహాచలం, పెన్ సత్తా, మార్చి 15:వరాహలక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం సాయంకాలం ఏకాదశి, సంక్రమణం, సందర్భం గా సింహగిరి పై గోవిందరాజ స్వామి తిరువీది పల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీ వార్లను సుందరంగా అలంకరించి పల్లకిలో ఉంచి, నాదస్వర, వేద మంత్రాల తో ఊరేగించారు. వేద పండితులు వేద పారాయణ చేశారు. నాలాయిర అధ్యాపకులు దివ్య ప్రబంధాన్ని గానం చేశారు. అర్చకులు, స్థానాచార్యులు, ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో ఈ పల్లకి సేవ కనుల పండుగగా సాగింది. తిరువీధిలో భాగంగా తిరువీధి పల్లకి సేవలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకొని పునీతులయ్యారు.

జాతరకు సిద్ధ మైన నూకంబిక దేవస్థానం

అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 15: ఉత్తరాంధ్ర ఇలివేలుకు రాష్ట్ర పండగ గుర్తింపు పొందిన గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో కొత్త అమావాస్య జాతర, ఉగాది మహోత్సవాలకు భారీ స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసామని దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు), ఆలయ కార్య నిర్వహణ అధికారి యాళ్ళ శ్రీధర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఈనెల 17, నుండి వచ్చేనెల 17 వరకు నెలరోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని, అమ్మవారి జాతర, కొత్త అమావాస్య పండగకు కు ఆలయానికి వచ్చే భక్తులకు ఇటు వంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆయన తెలియజేశారు. క్యూ లైన్ ల శాలవా పందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు దృష్టి ఉంచు కొని క్యూ లైన్ లో ఉండే భక్తులకు త్రాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, చిన్నపిల్లలకు పాలు సరఫరా చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ ఏడాది భారీ విద్యుత్ అలంకరణ, స్టేజ్ ప్రోగ్రామ్, నేల వేషాలు కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామని తెలియజేశారు. ఎటువంటి సంఘటన జరుపుకుంటా పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారని, వీటితోపాటు మెడికల్, ఫైర్, జీవీఎంసీ, విద్యుత్, శాఖ అధికారులు కూడా ఏర్పాటు చేస్తున్నారని అని తెలియజేశారు.



నేరాలకు స్వస్తి పలకాలి, లేదంటే నగరం నుంచి బహిష్కరణే.

- చిలకలూరిపేట రౌడీ షీటర్లకు టౌన్ సీఐ పి. రమేష్ హెచ్చరిక.
- శాంతిభద్రతల పరి రక్షణే లక్ష్యం.

చిలకలూరిపేట, పెన్ సత్తా, మార్చి 15: పట్టణ పోలీసు స్టేషన్ పరిధి లోని రౌడీ షీటర్ల ప్రవర్తన పై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఆదివారం పోలీసు స్టేషన్‌లో పట్టణ సీఐ పి. రమేష్ రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేలా ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ తప్పదు అని హెచ్చరించారు.

ఈ సందర్భంగా సీఐ రమేష్ రౌడీ షీటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని స్పష్టం చేశారు. ఎవరైనా గొడవలకు దిగినా లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నేర స్వభావాన్ని మార్చు కోని వారి పై పీడీ యాక్ట్ నమోదు చేయడమే కాకుండా, పట్టణ బహిష్కరణ చేసేందుకు కూడా వెనుకాడబోమని ఘాటుగా హెచ్చరించారు. మంచి మార్గంలో బతకాలని సూచన గతాన్ని వదిలిపెట్టి, సమాజంలో గౌరవప్రదంగా బతకాలని సీఐ సూచించారు. ఏదైనా పనులు చేసుకుంటూ కుటుంబంతో ప్రశాంతంగా జీవించాలని, మళ్లీ నేరాల బాట పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడే వారి పట్ల పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ధర్మవరంలో లోక్ అదాలత్ విజయవంతం

- జాతీయ లోక్ అదాలత్ లో 3 కోట్ల రూపాయల విలువతో కూడిన 282 కేసులు పరిష్కారం.
- ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 11 వ స్థానంలో ధర్మవరం కోర్టు.

ధర్మవరం, పెన్ సత్తా, మార్చి 15: పట్టణం లోని ధర్మవరం కోర్టులో శనివారం రాత్రి వరకూ నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతం అయిందని. ఈ లోక్ అదాలత్ లో 282 కేసులను పరిష్కారం చేయడం జరిగిందని సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ నందిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలకు రెండు బెంచ్ లలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ అదాలత్ జరిగిందని వారు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలతో పలు కేసుల వివరాలను తెలుపుతూ ఎస్సిజే కోర్టులో 3 +10 . కేసులు .పిడిఎమ్ కోర్ట్ లో మొత్తం కేసులు 59, ఏడిఎం కోర్టులో మొత్తం కేసులు 80, అందులో గొడవల కేసులు 77, సారాయి కేసులు 49 (రూ2,96,681 రూపాయలు), చెక్ బౌన్స్ కేసులు 6 (రూ.25,74,000), భరణం కేసులు 2, (20,000 రూపాయలు), ఇసుక కేసులు 4 ,(10,000/రూపాయలు), ఎస్సిజే కోర్ట్ లో భార్యాభర్తల రాజి కేసు 1 ,ఈ.పి.కేసులు 2 ,(65 లక్షల రూపాయలు), బ్యాంకు రుణాల కేసులు 10 (రూ.8,92,270), సివిల్ కేసు 1, ౨ూ 189/2025 కేసు పరస్పర రాజీ ద్వారా పరిష్కరించబడింది. (రూ 1,82,00,000/) దాసరి చెన్నమ్మ, కుటుంబ సభ్యులు, సర్వే నం.59 ధర్మవరం పొలం పరిధిలో గల వి ఆర్ . డెవలపర్స్ వారితో ఉన్న వివాదాన్ని రాజీ చేసుకున్నారు. ఈ రాజీ ప్రక్రియ నిడిమామిడి శ్రీశైల జగద్గురు మఠం, గూలూ రూ పీఠాధిపతి పూజ్య వీరభద్ర చెన్నమల్ల దేశికేంద్ర మహాస్వామి ఆధ్వర్యంలో జరిగింది. దీంతో సంబంధిత సర్వే నంబర్ పై ఉన్న అన్ని వివాదాలు ఈ రోజు లోక్ అదాలత్‌లో శాశ్వతంగా పరిష్కారమయ్యాయి. పెట్టి కేసులు 130 (రూ.4,71,640) మొత్తము విరసి 282 కేసులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. దాదాపు 3 కోట్ల రూపాయల ఈ మొత్తం కేసులో కక్షిదారులు పరిష్కరించుకోవడం జరిగింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లో 11 వ స్థానంలో ధర్మవరం కోర్టులు నిలిచాయి. ఈ జాతీయ లోక్ అదాలతో తూది తీర్పు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదాలత్ కమిటీ సభ్యులు బాలసుందరి భార్గవి శంకరయ్య, శివకుమార్, సీనియర్, జూనియర్, న్యాయవాదులు, కోర్టు పరిధి లోని అన్ని పోలీస్ స్టేషన్లో సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నూకాలమ్మ తల్లి దర్శనం చేసుకున్న దొడ్డి

మునగపాక, పెన్ సత్తా, మార్చి 15: మండలం లోని ఉమ్మలాడ గ్రామంలో నూకాలమ్మ తల్లి దర్శనం చేసుకున్న తెలుగుదేశం పార్టీ (మాజీ) మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు. అనంతరం దేవాలయం దగ్గర అమ్మవారి ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో పాల్గొని భక్తులందరికీ ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మలాడ సర్పంచ్ మంద రాము, మొల్లేటి నారాయణరావు, మొల్లేటి ఆనంద్, ఆడారి నూక నాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది.

నూకంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 15: రాష్ట్ర పండగ, ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకంబిక అమ్మవారి దేవస్థానంలో ఆలయ పునర్నిర్మాణ దర్శనం ప్రారంభ మైన మొదటి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్
ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు,
కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేషి, తదితరులు పాల్గొన్నారు.

బిర్యానీ, పులావ్ షాపుల మీద ఆహార భద్రతాధికారుల తనిఖీలు.

విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 15: నగరం లోని జీవీఎంసీ కార్యాలయం అవుట్ గేట్ కు ఎదురుగా ఉన్న 4 ఎఎం బిర్యానీ, కాకినాడవారి కోడి పులావ్, ఫుడీ మామ బిర్యానీ, స్పైసి బిర్యానీ పాయింట్స్ లో ఆహార భద్రతాధికారులు ఆకస్మిక తనిఖీ చేసి అక్కడి శ్యాంపిల్స్ ను సేకరించారు. ఆయా షాపుల్లో అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారీ చేస్తున్నట్లు గుర్తించామని విశాఖ నగర అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కల్యాణ చక్రవర్తి తెలిపారు. అక్కడ పరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేయాలని ఆయా షాపుల యజమానులకు నోటీస్ లను జారీచేశామన్నారు. ఫుడ్ హ్యాండలర్స్ మాస్క్, కాప్, ఏప్రాన్ తదితర మైనవి ధరించాలని, వారికి ఫిజికల్ ఫిట్ నెస్ సర్టిఫికెట్ కరెక్ట్ గా ఉండాలని, ఫ్లోర్స్ అండ్ వాల్స్ సీలింగ్, గార్బేజ్ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. చికెన్ బిర్యానీ, చికెన్ ఫ్రై, చికెన్ కర్రీ, మటన్ బిర్యానీ, వేపుళ్లు, వాటికి వాడే నూనె తదితర 14 రకాల శ్యాంపిల్స్ సేకరించి వాటి అనాలిసిస్ నిమిత్తం ఫుడ్ ల్యాబ్ కి పంపామన్నారు. వాటి రిపోర్ట్ ల ఆధారంగా ఎఫ్ఎస్ఎస్ఎఐ యాక్ట్ ప్రకారం సంబంధిత వ్యాపారుల పై తగిన చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ తనిఖీల్లో ఆహార భద్రతాధికారులు జి.వి.అప్పారావు, సతీష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కైట్స్ కాలేజీలో మెగా జాబ్ మేళా

అచ్యుతాపురం, పెన్ సత్తా, మార్చి 15: అచ్యుతాపురం లోని కైట్స్ జూనియర్, డిగ్రీ కాలేజీలో ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం నేడు సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కాలేజీ ప్రాంగణంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ జాబ్ మేళాలో కంప్యూటర్ ఆపరేటర్, క్యాషియర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సేల్స్ ఇవాల్యుయేటర్స్, టెక్నీషియన్స్, జనరల్ మేనేజర్(సేల్స్), జనరల్ మేనేజర్ సర్వీస్ వంటి పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. వీటికి ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఫ్రెషర్స్ కూడా అప్లై చేసుకోవచ్చని తెలిపారు. ఎంపి కైన అభ్యర్థులకు నెలకు 25,000 వరకు జీతం ఇవ్వబడుతుంది. ఉద్యోగాలు గాజువాక, పెందుర్తి, సబ్బవరం, పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, అరకు, పాడేరు ప్రాంతాల్లో ఉంటాయని తెలిపారు. ఉద్యోగం కోరుకునే అభ్యర్థులు తమ రెజ్యూమ్, విద్యా సర్టిఫికెట్లతో హాజరు కావాలని నిర్వాహకులు సూచించారు. మరిన్ని వివరాల కోసం 70134 19359, 80191 38686 నంబర్లను సంప్రదించవచ్చు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష, పురస్కార ప్రదానోత్సవంలో ఎంపీపీ



పరవాడ, పెన్ సత్తా, మార్చి 15:3 వ మోడరన్ శిటో ర్యు కరాటే డో అసోసియేషన్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష, పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం పరవాడ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విజయవంతంగా నిర్వహించబడింది. మోడరన్ శిటో ర్యు కరాటే డో అసోసియేషన్ అధికారుల మార్గదర్శకత్వంలో, మహారాజ్ ఛాంపియన్స్ కరాటే అకాడమీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

మోడరన్ శిటో ర్యు కరాటే డో అసోసియేషన్కు చెందిన పలువురు విశిష్ట అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, గ్రేడింగ్ పరీక్షలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి షిహాన్ డాక్టర్ ఏ. అప్పలరాజు(ప్రధాన శిక్షకులు ప్రధాన పరీక్షకులు & ప్రధాన కోచ్ ఎంఎస్కేఎ ఇండియా సెన్సాయి), ఆర్.వి.ఎస్.కే. మోహిత్ (అధిపతి & అధ్యక్షుడు ఎంఎస్కేఎ దక్షిణ భారతదేశం

రెన్షి) కే. లోవరాజు (ప్రధాన కార్యదర్శి ఎంఎస్కేఎ దక్షిణ భారతదేశం

–సెన్సాయి), పి. అనుదీప్ (అధిపతి & అధ్యక్షుడు ఎంఎస్కేఎ ఆంధ్రప్రదేశ్

– రెన్షి), కే . మహేష్ (ప్రధాన కార్యదర్శి ఎంఎస్కేఎ ఆంధ్రప్రదేశ్). ఈ కార్యక్రమం సందర్భంగా ప్రధాన నిర్వాహకులైన రెన్షి కడవల లోవరాజు (దక్షిణ భారతదేశ ప్రధాన కార్యదర్శి), కాకర మహేష్ (ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి)లకు 'మోడరన్ శిటో ర్యు కరాటే డో అసోసియేషన్ ఇండియా లో అధికారులుగా అధికారిక పదోన్నతి లభించింది. వీరిద్దరూ రిఫరీ –బి, సీనియర్ ఎక్సమినర్, సీనియర్ కోచ్ పరీక్షలలో విజయవంతంగా ఉత్తీర్ణులై, అసోసియేషన్ నుండి తమ అధికారిక లైసెన్సులను అందుకున్నారు. బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష, పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మొత్తం 26 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరందరూ తమ కరాటే శిక్షణలో అంకితభావం, క్రమశిక్షణను ప్రదర్శించారు. ఈ పోటీల్లో గ్రేడింగ్ విభాగాల వివరాలు

1 వైట్ బెల్ట్ విద్యార్థి, 17 ఎల్లో బెల్ట్ విద్యార్థులు, 2 బ్లూ బెల్ట్ విద్యార్థులు,

3 బ్రౌన్ బెల్ట్ విద్యార్థులు, 1 జూనియర్ బ్లాక్ బెల్ట్ విద్యార్థి, 2 ఫోర్త్ డాన్ సీనియర్ బెల్ట్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి

ముఖ్య అతిదులుగా ఎంపీపీ

పయిల వెంకట పద్మ లక్ష్మి, మల్లికార్జున్ (సర్కిల్ ఇన్స్పెక్టర్) పాల్గొన్నారు.

గౌరవ అతిథులుగా సిరపరపు అప్పలనాయుడు (సర్పంచ్), రాయవరపు దేముడు మాజీ సర్పంచ్, పయిల హరీష్ 3వ వార్డు సభ్యుడు,

పయిల సాయి అప్పల నాయుడు, మండల ఎస్.సి సెల్ ప్రెసిడెంట్ ములకపల్లి రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు యువతలో కరాటే, క్రమశిక్షణను ప్రోత్సహించడానికి మహారాజ్ ఛాంపియన్స్ కరాటే అకాడమీ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఆత్మవిశ్వాసం, ఫిట్‌నెస్, వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి మార్షల్ ఆర్ట్స్ సాధన కొనసాగించాలని వారు విద్యార్థులను ప్రోత్సహించారు. బెల్ట్ ప్రమోషన్లు, అవార్డు సత్కారం, కరాటే పట్ల వారి అత్యుత్తమ ప్రదర్శన, అంకితభావానికి విద్యార్థుల ప్రశంసలతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

నూకాలమ్మ తల్లి జాతర గోడపత్రిక ఆవిష్కరణ.

పరవాడ, పెన్ సత్తా, మార్చి 15: మండలం వెన్నెలపాలెం గ్రామంలో కొలువతీరిన నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని ఈనెల 18 న బుధవారం కొత్త అమావాస్య పర్వదినాన ఘనంగా నిర్వహించనున్నారు. జాతరలో భాగంగా నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాలకు సంబంధించిన గోడ పత్రికను ఆదివారం నూకాలమ్మ తల్లి ఆలయం వద్ద స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ పెద్దలు ఆవిష్కరించారు. బుధవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభం అవుతాయని, మధ్యాహ్నం 12 గంటల నుండి దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సామరాధన నిర్వహించ బడుతుందని తెలిపారు. జాతరలో భాగంగా సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెన్నెల ఏకుల అప్పారావు, వాసిరెడ్డి ఈశ్వర్రావు, పయిల ప్రసాద్, భోజంకి అప్పల నాయుడు, వెన్నెల వెంకట గిరి, గొంప మారునాయుడు, లోకిరెడ్డి సన్యాసి

నాయుడు(అభి), బండారు సోము నాయుడు, వెన్నెల నరసింహారావు, ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, పయిల రమణాజీ, బండారు సతీష్, బండారు నర్సింగరావు, మాసవరపు నాయుడు(ఎన్టీపిసి), వాసిరెడ్డి ఎర్రినాయుడు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుండి పదవ తరగతి పరీక్షలు

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 15:నేటి నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. మండలంలో నక్కపల్లి, బాలురు, బాలికల హైస్కూల్, గురుకులం, వేంపాడు,గొడిచర్ల హైస్కూల్స్ కేంద్రాలుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక మండల విద్యాశాఖాధికారి ఆదివారం తెలిపారు. మండలంలో 890 మంది బాల బాలికలు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. సోమవారం నుండి ఏప్రియల్ 1వ తేదీవరకూ పరీక్షలు ఉదయం గం 09–30 నుండి మద్యాహ్నం గం 12–30 వరకూ జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రానికి కనీసం అరగంట ముందుగా చేరుకోవాలని సూచించారు. ప్రస్తుతం వేసవిని దృష్టిలో ఉంచుకుని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీరు ,విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు వడ దెబ్బకు గురి కాకుండా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితి పరిశీలించడం జరుగుతుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉదయం గం 09లకు ప్రవేశద్వారం వద్ద తనిఖీలు నిర్వహించి పరీక్షా కేంద్రాలకు అనుమతించడం జరుగుతుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అట్ట, పెన్నులు, హాల్ టికెట్ తో మాత్రమే లోపలికి ప్రవేశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులెవరూ ఎటువంటి ఒత్తిడి,ఆందోళనకు గురి కాకుండా పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు.

నక్కపల్లి నూకాలమ్మ తల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు - పరిశీలించిన కమిటీ సభ్యులు

నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 15: మండల కేంద్రంలో నక్కపల్లి నూకాలమ్మ తల్లి జాతర ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం పరిశీలించారు. కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగా పార్టీలకతీతంగా గ్రామంలో కమిటీ ఏర్పాటు చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించారు. అమ్మవారి ఆలయం మొత్తం రంగులు వేయించి సిద్ధం చేశారు. జాతీయ రహదారి నుండి నూకాలమ్మ అమ్మవారి ఆలయ వరకు పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. నూకాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, కార్యదర్శి పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, కమిటీ పాలకవర్గ సభ్యులు ప్రత్యేకంగా సమావేశమై ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. కొత్త అమావాస్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అల్లాడ కొండబాబు, కోలనాటి దుర్గాప్రసాద్, కర్రీ వెంకట సత్యనారాయణ, వీసం రాజు, ముద్దా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

జిల్లాలోని 82 పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలు

జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్

బాపట్ల,పెన్ సత్తా,మార్చి 15 :పదవ తరగతి పరీక్షలు అత్యంత పారదర్శకంగా,ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా బాపట్ల జిల్లాలోని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ తెలిపారు.మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 82 పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయని తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ముఖ్యంగా పరీక్షా పత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు,ప్రశ్నపత్రాలను కేంద్రాలకు తరలించే సమయంలో,తిరిగి సమాధాన పత్రాలను తరలించే సమయంలో పోలీస్ ఎస్కార్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ మరియు ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలని తెలిపారు.పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆల్ ది బెస్ట్ తెలిపారు.

టిఫిన్ సెంటర్లలో ధరల పెంపు

- సామాన్య ప్రజలపై అదనపు భారం
- రూ.30 నుంచి రూ.40కు ప్లేట్ టిఫిన్
- సామాన్యుల కష్టాలు పెరుగుతున్నాయా?



పెన్ సత్తా, ఏన్కూరు మార్చి 15 2026: ఏన్కూరు మండలంలోని పలు టిఫిన్ సెంటర్లలో ఇటీవల టిఫిన్ ధరలను అనూహ్యంగా పెంచడం సామాన్య ప్రజల్లో ఆందోళనకు గురిచేస్తోంది. ఇంతకుముందు రూ.30కు అందిస్తున్న టిఫిన్ ప్లేటును ప్రస్తుతం రూ.40కు విక్రయిస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. ఒక్కసారిగా రూ.10 పెంపు చేయడం వల్ల రోజువారీగా టిఫిన్‌పై ఆధారపడే కార్మికులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, చిన్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

టిఫిన్ సెంటర్ నిర్వాహకులు గ్యాస్ ధరలు పెరగడం, సరఫరాలో కొరత ఏర్పడడం వల్ల ఖర్చులు అధికమయ్యాయని చెబుతున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా యురాన్––ఇజ్రాయిల్ యుద్ధాల ప్రభావంతో గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని వారు వివరిస్తున్నారు. దీంతో వంట గ్యాస్ సిలిండర్ల లభ్యత తగ్గి, బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని కూడా కొందరు నిర్వాహకులు పేర్కొంటున్నారు. అయితే వినియోగదారుల అభిప్రాయం మాత్రం భిన్నంగా ఉంది. గ్యాస్ కొరతను కారణంగా చూపుతూ అధిక లాభాల కోసం ధరలు పెంచుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల టిఫిన్ నాణ్యతలో మార్పులు లేకపోయినా ధరలు పెరగడం అన్యాయమని ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా ఉదయం మరియు సాయంత్రం వేళల్లో టిఫిన్ సెంటర్ల వద్ద రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రజలకు ప్రత్యామ్నాయాలు కూడా లేవని చెబుతున్నారు.

ఇంకా కొందరు టిఫిన్ సెంటర్లు ధరల జాబితాను బహిరంగంగా ప్రదర్శించకుండా వినియోగదారుల నుంచి ఎక్కువ మొత్తాలు వసూలు చేస్తున్నారని సమాచారం. ధరల పెంపుపై ఎటువంటి అధికారిక నోటీసులు లేకపోవడం కూడా ప్రజల్లో సందేహాలకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యాపారులు మాత్రం పెరిగిన ముడి సరుకు ధరలు, వంట నూనె, పప్పులు, కూరగాయలు, గ్యాస్ వంటి అవసరమైన వస్తువుల ఖర్చులు పెరగడంతో తాము కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ధరలు పెంచకపోతే వ్యాపారం నష్టాల్లోకి వెళ్లే పరిస్థితి ఉందని వారు అంటున్నారు.

ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకుని ధరలను నియంత్రించేందుకు అధికారులు ముందుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.ధరల నియంత్రణ లేకపోతే రోజువారీ జీవన వ్యయాలు మరింత పెరిగి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం అధికమయ్యే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు
PEN SATTA Telugu Daily

ఎడిటోరియల్

వివేకా హత్యకు ఏడేళ్ళు ...మిగిలింది కన్నీళ్లు

కన్న తండ్రిది దారుణ హత్య అన్నది తెలుసు. ఎవరు చేశారు అన్నది నిరూపించే ప్రయత్నంలో కూతురు ఎంతో శ్రమించి న్యాయ పోరాటం చేసింది. కానీ చివరికి వారికి మిగిలింది కన్నీళ్ళు మాత్రమే అని అంటున్నారు. ఒక ప్రముఖుడి హత్య జరిగితే ఈ రోజుకీ ఏమీ తేలకపోవడం హత్య ఎవరు చేశారు అన్నది ఒక మిస్టరీగా మారడం కంటే విషాదాంతం వేరొకటి ఉండదు.

సామాన్యుడు కారు :

వైఎస్ వివేకానందరెడ్డి సామాన్యుడు అయితే కారు. స్వయాన ఎంపీగా మంత్రిగా ఎమ్మెల్సీగా పనిచేసిన వారు. అంతే కాదు మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్సార్ కి అనుంగు తమ్ముడు. అంతే కాదు మాజీ సీఎం కి చిన్నాన్న. రాజకీయంగా ప్రముఖ కుటుంబం. దశాబ్దాలుగా పలుకుబడి కలిగి తాము ఉన్న ప్రాంతంలో తిరుగులేని ఆధిపత్యం చలాయించిన చోటనే పులివెందులలో తన సొంత ఇంట్లోనే వివేకా దారుణ హత్యకు గురి అయ్యారు. గొడ్డలి వేటుతో ఆయనను హంతకులు ప్రాణాలు తీశారు.

ఇప్పటికీ తెలియదు :

వివేకానందరెడ్డి 2019 మార్చి 14 అర్ధరాత్రి సమయంలో అంటే తెల్లారితే మార్చి 15 అన్న మాట దారుణ హత్యకు గురి అయ్యారు. ఆయన హత్యకు గురి అయ్యారు అన్న సంగతి లోకానికి 15న పొద్దు పొద్దున్నే తెలిసింది.అది కూడా ఏపీలో సార్వత్రిక ఎన్నికలకు కొన్ని వారాల ముందు ఈ దారుణం జరిగింది. అయితే మొదట గుండెపోటుగా ప్రచారం జరిగినప్పటికీ పోలీసులు ఎంట్రీ ఇచ్చాక దారుణహత్యగా నిర్ధారించారు, ఇక ఈ కేసుని ప్రస్తుతం సిబిఐ దర్యాప్తు చేస్తోంది. ఇక వివేకా ఏకైక కుమార్తె డాక్టర్ సునీత తన తండ్రి హత్య కేసుని చేదించాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. న్యాయం కోసం ఆమె పోరాడుతున్నారు. హత్య వెనుక ఉన్న పెద్ద కుట్రని వెలికి తీయాలని ఆమె ఆరాటపడుతున్నారు.

లేటెస్ట్ అప్డేట్స్ :

ఇక వివేకా హత్య కేసులో తాజా సమాచారం ఏంటి అంటే ఈ కేసులో ఇప్పటికే దర్యాప్తు ముగిసిందని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ కేసులో అదనంగా అనుమానితులు నిందితులు ఎవరూ లేరని కూడా ఆ మేరకు తగిన సాక్ష్యాలు లేవని అత్యున్నత న్యాయ స్థానానికి వివరించింది. దీంతో ఈ కేసుని సీబీఐ ట్రయల్ కోర్టు లో విచారణను వేగవంతం చేయాలని, నాలుగు వారాలలోగా ముగించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

అసలు దోషులు ఎవరు :

ఇక వివేకా హత్య కేసులో అసలు దోషులు ఎవరు అన్నది ఈ రోజుకీ ఒక మిస్టరీగానే ఉండిపోయింది. పాత్ర ధారులు సూత్ర ధారులు ఎవరు అన్నది మాత్రం తేలలేదు, సీబీఐ వంటి అత్యున్నత సంస్థ దేశంలోనే ఎన్నో కేసులను చేదించిన సంస్థ కూడా ఈ కేసులో ఉన్న పెద్ద కుట్రను చేదించలేకపోయిందా అన్న చర్చ అయితే సాగుతోంది అంతే కాదు ఆధారాలు లేవా లేక నాశనం అయ్యాయా లేక ఏమి జరిగి ఉండొచ్చు అన్నది కూడా చర్చగానే ఉంది. ఈ కేసులో అసలు నిజాలు ఏమిటి అన్నది ఇక ఎవరి ఆలోచనలకు ఊహకు వదిలేయాల్సిందేనా అన్నది కూడా ఉంది. ఈ హత్య జరిగినపుడు ఏపీలో టీడీపీ ప్రభుత్వం ఉంది. ఆ తరువాత అయిదేళ్ళ పాటు వైసీపీ ఉంది. ఇపుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు అయింది. కేంద్ర దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగి నాలుగేళ్ళకు పైగా విచారణ చేసింది అయినా అసలు దోషులు తేలకపోవడమే విషాదం అని అంటున్నారు.

పొద్దున్నే అరటి పండు తింటున్నారా?

అరటిపండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండ్లలో ఒకటి. అంతేకాదు.. అన్ని సీజన్లు, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేది అరటి పండు. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ అరటి పండును ఇష్టంగా తింటారు. చాలా మంది ఉదయం అల్పాహారం ముందు లేదా ఖాళీ కడుపుతో అరటిపండు తినే అలవాటు పెట్టుకుంటారు. అరటి పండులో ఎన్నో పోషకాలు ఉంటాయి. పొటాషియం, విటమిన్ బి6, మెగ్నీషియం ఇందులో సమృద్ధిగా ఉంటాయి. దీని వలన జీర్ణశక్తి పెరగడంతో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఉదయాన్నే నిద్రలేవగానే అరటి పండు తినడం మంచిదేనా ? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియంతో పాటు అరటి పండులో నేచురల్ షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉండటం వలన బీపీ పెరిగి, రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం ఎక్కువగా ఉండటంతో గుండె ఆరోగ్యానికి కూడా ఇది మేలు చేస్తుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటంలో కూడా అరటిపండు ఉపయోగపడుతుంది. ఉదయాన్నే అరటిపండు తింటే శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇది సహజమైన చక్కెరలు (గ్లూకోజ్, ఫ్రుక్టోజ్, సుక్రోజ్) కలిగి ఉండటం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా అరటిపండు ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ వల్ల కడుపు సక్రమంగా పనిచేస్తుంది. ముఖ్యంగా మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఇది మంచి పరిష్కారంగా ఉంటుంది. ఉదయం అరటిపండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేసే అవకాశం ఉంది. మానసిక ఆరోగ్యానికి కూడా అరటిపండు ఉపయోగకరం. ఇందులో ట్రిప్టోఫాన్ అనే పదార్థం ఉండటంతో ఇది శరీరంలో సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచి మూడ్‌ను మెరుగుపరుస్తుంది. దీంతో ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుంది. అరటిపండులో పొటాషియం, ఫైబర్, విటమిన్ అ, విటమిన్ ః6 వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఉదయాన్నే అరటి పండు తినడం వలన ఇన్‌స్టాంట్ ఎనర్జీ లభిస్తున్నప్పటికీ ఆరోగ్యనిపుణులు ఇది మంచిది కాదని తెలిపారు. ఉదయాన్నే అరటి పండు తినడం వలన యాసిడిటీ సమస్య రావచ్చని చెబుతున్నారు. ఉదయాన్నే అరటి పండు తినడం వలన తక్షణమే శక్తి లభిస్తుంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం లెవల్స్ సమృద్ధిగా ఉంటాయి. అరటి పండులో తక్కువ కేలరీలు ఉన్నప్పటికీ, అధికంగా తినడం వలన శరీర బరువు పెరిగే అవకాశం ఉంది. అయితే ఖాళీ కడుపుతో ఎక్కువగా అరటిపండ్లు తినడం మంచిది కాదని కొంతమంది నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ లేదా ఆమ్లత్వ సమస్యలు ఉన్నవారు పరిమితంగా తినడం మంచిది. మొత్తానికి ఉదయం ఒక అరటిపండు తినడం శరీరానికి శక్తి, జీర్ణక్రియ, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అయితే సమతుల ఆహారంతో పాటు తీసుకుంటే మరింత ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

విరుద్ధ ఆహారంతో చర్మ వ్యాధులు

పాలు సంపూర్ణ ఆహారం అని మనందరికీ తెలుసు. పెరిగే పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ పాలు ఎంతో బలాన్ని ఇస్తాయి. అయితే, పాలు ఎంత పోషక విలువలు కలిగినవో, అంతే సెన్సిటివ్ కూడా. ఆయుర్వేదం ప్రకారం పాలను కొన్ని రకాల ఆహార పదార్థాలతో కలిపి తీసుకుంటే అవి మన జీర్ణవ్యవస్థపై వినాశకర ప్రభావాన్ని చూపుతాయి. శరీరంలో టాక్సిన్స్ (విషతుల్యాలు) పేరుకుపోవడానికి కారణమవుతాయి. పాలు తాగేటప్పుడు మనం చేసే చిన్న చిన్న తప్పులు ఎలాంటి అనారోగ్యాలకు దారితీస్తాయో తెలుసుకుందాం. ఆమె రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో పాలు, పండ్లను కలిపి తీసుకుంటుంది. అతను జిమ్ ముగించుకుని గుడ్లు, పాలు కలిపి సేవిస్తాడు. ఇవి ఆరోగ్యానికి చాలా మంచివని వారు నమ్ముతుంటారు. కానీ, కొన్ని రోజుల తర్వాత వారిద్దరికీ చర్మంపై దద్దుర్లు, కడుపులో ఉబ్బరం వంటి సమస్యలు మొదలయ్యాయి. ఖరీదైన మందులు వాడినా ఫలితం లేదు. ఎందుకో తెలుసా? వారు తీసుకుంటున్న ఆహారంలోనే అసలు శత్రువు దాగి ఉన్నాడు. పాలు ఒక అమృతం లాంటిదే కావచ్చు, కానీ కొన్ని వస్తువులతో కలిస్తే అది విషంగా మారుతుంది.

1. పాలు ? సిట్రస్ పండ్లు (నిమ్మ, నారింజ): నిమ్మ, నారింజ, స్ట్రాబెర్రీ, పైనాపిల్ వంటి పండ్లు ఆమ్ల గుణాన్ని కలిగి ఉంటాయి. పాలు చలవ చేసే గుణం కలిగి ఉండి జీర్ణం కావడానికి సమయం తీసుకుంటాయి. ఈ రెండింటిని కలిపి తీసుకున్నప్పుడు కడుపులో పాలు వెంటనే విరిగిపోతాయి. దీనివల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ మరియు చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే పాలు తాగిన గంట వరకు ఈ పండ్లను తీసుకోకపోవడమే మంచిది.

2. చేపలు ? పాలు: మన పెద్దలు ఎప్పుడూ చెప్పే మాట.. చేపలు తిన్న తర్వాత పాలు తాగకూడదు. ఆయుర్వేదం ప్రకారం చేపలు వేడి చేసే గుణాన్ని, పాలు చలవ చేసే గుణాన్ని కలిగి ఉంటాయి. ఈ రెండు విరుద్ధ స్వభావాలు కలిగిన ఆహారాలను కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో అసమతుల్యత ఏర్పడి దీర్ఘకాలంలో చర్మ అలర్జీలు, బొల్లి వంటి సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.

3. పాలు– పుల్లని పదార్థాలు (ఊరగాయలు, వెనిగర్): ఊరగాయలు, వెనిగర్ తో చేసిన వంటకాలు లేదా పుల్లటి పెరుగుతో చేసిన పదార్థాలను పక్కన పెట్టుకుని పాలు తాగడం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. వీటిలోని ఆమ్లాలు పాలను గడ్డకట్టేలా చేస్తాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థలో అసౌకర్యం కలగడమే కాకుండా, వికారం వచ్చే అవకాశం ఉంది.

4. గుడ్లు– పాలు: ప్రస్తుత డైట్ ప్లాన్లలో పాలు, గుడ్లు కలిపి తీసుకోవడం సాధారణమైపోయింది. కానీ సాంప్రదాయ విజ్ఞానం దీనిని అంగీకరించదు. పాలలో కొవ్వు ఎక్కువగా ఉంటుంది, గుడ్లలో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. ఈ రెండింటిని కలిపి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై భారం పడుతుంది. ముఖ్యంగా ఉడకని లేదా పచ్చి గుడ్లను పాలతో కలిపి తీసుకుంటే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. ఆరోగ్యం కోసం పాలు తాగడం మంచిదే, కానీ ఏది దేనితో కలపాలో తెలియకపోతే అది అనారోగ్యానికి దారితీస్తుంది. పైన పేర్కొన్న పదార్థాలకు, పాలకు మధ్య కనీసం గంట లేదా రెండు గంటల విరామం ఉండేలా చూసుకోండి. మీ జీర్ణక్రియను కాపాడుకోవడం మీ చేతుల్లోనే ఉంది.

ఈ 'కొవ్వు' ఉంటే లివర్ ప్రమాదంలో ఉన్నట్టే!



ప్రస్తుత కాలంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో లివర్ క్యాన్సర్ ఒకటి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. కానీ, మనం రోజూ తీసుకునే కొన్ని రకాల కొవ్వు పదార్థాలు మన కాలేయాన్ని క్యాన్సర్ గురిచేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యం కోసం మనం తీసుకునే ఆహారంలో కొవ్వులు ఒక ముఖ్యమైన భాగం. అయితే, మీరు ఎంచుకునే ఆ కొవ్వు పదార్థమే మీ ప్రాణాల మీదకు తీసుకురావచ్చని మీకు తెలుసా? ముఖ్యంగా అధిక బరువు ఉన్నవారిలో కొన్ని రకాల కొవ్వులు కాలేయంలో ట్యూమర్ల వృద్ధిని వేగవంతం చేస్తున్నాయని తాజా పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

లివర్ క్యాన్సర్ లో అత్యంత సాధారణ రూపం 'హెపటో సెల్యులార్ కార్సినోమా' (ఊఅఅ). ఇది స్థూలకాయం మరియు మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ సంబంధిత ఫ్యాటీ లివర్ డిసీజ్ వల్ల వస్తుందని డాక్టర్ సౌరభ్ వివరించారు. కేవలం శరీర బరువు పెరగడం మాత్రమే కాదు, మనం ఎటువంటి కొవ్వులు తింటున్నామనేది క్యాన్సర్ ముప్పును నిర్ణయిస్తుంది. 2025లో ప్రచురితమైన పదేళ్ల సుదీర్ఘ అధ్యయనం ప్రకారం.. జంతువుల నుండి సేకరించిన కొవ్వులు స్థూలకాయం ఉన్నవారిలో ట్యూమర్ పెరుగుదలను గణనీయంగా పెంచుతున్నాయని తేలింది.మనం రెగ్యులర్ గా వాడే వెన్న, పంది కొవ్వు, గొడ్డు మాంసం కొవ్వు వంటి జంతు సంబంధిత ఫ్యాట్స్ కాలేయ వ్యాధులకు ప్రధాన కారకాలుగా మారుతున్నాయి. ఇవి కేవలం బరువు పెంచడమే కాకుండా, కాలేయ కణాలలో క్యాన్సర్ కారక మార్పులను ప్రేరేపిస్తాయి. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్లాంట్–బేస్డ్ (మొక్కల ఆధారిత) కొవ్వులను ఎంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆలివ్ ఆయిల్, పామాయిల్ మరియు కొబ్బరి నూనె వంటివి అధిక బరువు ఉన్నప్పటికీ క్యాన్సర్ వృద్ధిని ప్రోత్సహించవని పరిశోధనల్లో తేలింది. వీటితో పాటు స్థిరంగా బరువు తగ్గడం ద్వారా ఫ్యాటీ లివర్ సమస్యను నయం చేసుకోవచ్చని, క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. లివర్ క్యాన్సర్ ను అడ్డుకోవాలంటే కేవలం బరువు తగ్గితే సరిపోదు, మన డైట్ లో ఉండే కొవ్వుల మూలాన్ని కూడా గమనించాలి. జంతు సంబంధిత కొవ్వులను తగ్గించి, సహజ సిద్ధమైన మొక్కల ఆధారిత నూనెలను వాడటం ద్వారా కాలేయాన్ని రక్షించుకోవచ్చు. కాలేయం మీ శరీరానికి ఫిల్టర్ లాంటిది, దానిని ఆరోగ్యంగా ఉంచుకోవడం మీ చేతుల్లోనే ఉంది.

ఇదీ భారత్ సత్తా

భారత క్రికెట్ సత్తాకు తగిన ఫలితాలు వస్తుండడం సంతోషాన్నిస్తోందని టీమ్ఇండియా మాజీ కెప్టెన్, కోచ్ రాహుల్ ద్రవిడ్ అన్నాడు. ఆదివారం బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమం సందర్భంగా ద్రవిడ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. అతడు ఈ కార్యక్రమంలో మాజీ స్టార్లు రోజర్ బిన్నీ, మిథాలి రాజ్‌లతో పాటు కల్నల్ సీకే నాయుడు జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నాడు. బీసీసీఐ ప్రదానం చేసే అత్యున్నత అవార్డు ఇది. భారత క్రికెట్‌కు గొప్ప సేవలు చేసిన క్రికెటర్లకు దీన్ని ఇస్తారు. భారత్ గత రెండు పురుషుల టీ20 ప్రపంచకప్‌లు, 2025 మహిళల వన్డే ప్రపంచకప్, 2026 పురుషుల అండర్-19 ప్రపంచకప్, 2025 మహిళల అండర్-19 ప్రపంచకప్ గెలుచుకుంది.

"భారత క్రికెట్ ఎప్పుడూ గొప్ప సత్తా ఉన్నదే. ఇప్పుడు మైదానంలో అందుకు తగిన ఫలితాలు వస్తున్నాయి. గత మూడు దశాబ్దాల కాలంలో భారత క్రికెట్ ఎంతో అభివృద్ధి చెందింది. బీసీసీఐకి ఎప్పుడూ మంచి పాలకులే ఉన్నారు. మంచి కోచ్‌లూ ఉన్నారు. గొప్ప మౌలిక సదుపాయాలనూ ఏర్పరుచుకున్నాం. మనకు అద్భుతమైన దేశవాళీ వ్యవస్థ ఉంది. జూనియర్ క్రికెట్ కూడా బాగుంది. తాజాగా టీ20 ప్రపంచకప్ విజయం ఎంతో సంతోషాన్నిస్తోంది. ఫేవరెట్‌గా టోర్నీలో బరిలోకి దిగడం అంత తేలిక కాదు" అని ద్రవిడ్ అన్నాడు. టీ20 ప్రపంచకప్‌లో సంజు శాంసన్ బాగా రాణించడంపై అతడు సంతోషం వ్యక్తం చేశాడు.

ఉత్తమ క్రికెటర్లు గిల్, స్మృతి

స్టార్ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, స్మృతి మంధాన ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్లుగా ఎంపికయ్యారు. బీసీసీఐ వార్షిక అవార్డు కార్యక్రమంలో వీళ్లు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. 2024-2025 సీజన్‌లో ప్రదర్శనకుగాను పురుషులు, మహిళల విభాగాల్లో గిల్, స్మృతిలకు ఈ పురస్కారం దక్కింది. 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును అందుకోవడం గిల్‌కు ఇది రెండోసారి కాగా.. స్మృతికి అయిదోసారి. 2025లో గిల్ టెస్టు క్రికెట్లో గొప్పగా రాణించాడు. ఇంగ్లాండ్ పర్యటనలో 10 ఇన్నింగ్స్‌లో 75.40 సగటుతో 754 పరుగులు చేశాడు. భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడంలోనూ అతడు ముఖ్య పాత్ర పోషించాడు. స్మృతి 2025లో 1703 అంతర్జాతీయ పరుగులు చేసింది. క్యాలెండర్ ఏడాదిలో ఓ మహిళా క్రికెటర్ చేసిన అత్యధిక పరుగులివే. ఇందులో 1362 వన్డే పరుగులు ఉన్నాయి. ఓ క్యాలెండర్ ఏడాదిలో వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన మహిళ ఆమెనే.

తెలుగమ్మాయి శ్రీచరణి, హర్షిత్ రాణాలు ఉత్తమ అంతర్జాతీయ అరంగేట్ర క్రికెటర్లుగా పురస్కారాలు గెలుచుకున్నారు. షెఫాలి వర్మ (ఉత్తమ మహిళా క్రికెటర్, సీనియర్ దేశవాళీ వన్డే), ఇరా జాదవ్ (ఉత్తమ మహిళా క్రికెటర్, జూనియర్ దేశవాళీ), హర్ష్ దూబె (అత్యుత్తమ రంజీ ఆల్‌రౌండర్), ఆయుష్ మాత్రే (దేశవాళీ పరిమిత ఓవర్ల క్రికెట్లో ఉత్తమ ఆల్‌రౌండర్) కూడా అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. అయిదు ఐసీసీ ట్రోఫీలు (2025 నుంచి) గెలిచిన భారత జట్లను అవార్డుల కార్యక్రమంలో సత్కరించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన అరుంధతి రెడ్డి, గొంగడి త్రిష, షబ్నమ్‌లు ఈ జట్లలో ఉన్నారు.

ఐపీఎల్ ట్రోఫీనే లక్ష్యం... వైభవ్

వచ్చే ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ట్రోఫీ గెలవడమే తన లక్ష్యమని అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు సభ్యుడు వైభవ్ సూర్యవంశీ అన్నాడు. "ఇప్పుడు నా లక్ష్యం ఐపీఎల్‌లో నా జట్టు తరఫున ట్రోఫీ గెలవడమే. అది చాలా ముఖ్యం. నేను బాగా రాణించాలనుకుంటున్నా. నా ప్రదర్శన జట్టుకు ఉపయోగపడుతుంది. రాజస్థాన్ కప్పు గెలవడంలో నా వంతు పాత్ర పోషించడమే నా ధ్యేయం" అని 14 ఏళ్ల వైభవ్ చెప్పాడు.

ఇక ఆ కప్పే మా లక్ష్యం

దిల్లీ: వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ గెలవడమే తమ జట్టు లక్ష్యమని భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. "కిందటిసారి భారత్‌లో టోర్నీ జరిగినప్పుడు కప్పునకు చాలా చేరువగా వెళ్లాం. తర్వాత దక్షిణాఫ్రికాలో ఆడబోతున్నాం. అది మాకు గొప్ప అవకాశం. ఏ ఫార్మాట్లో అయినా ప్రపంచకప్ గెలవడమే జట్టుకు లక్ష్యంగా ఉంటుంది" అని చెప్పాడు. 2023 ప్రపంచకప్‌లో వరుసగా పది మ్యాచ్‌లు గెలిచిన టీమ్ఇండియా... ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఆ ఫైనల్ మళ్లీ ఆడి గెలిస్తే బాగుండని తనకు అనిపిస్తూ ఉంటుందని టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. 2028లో టీ20 ప్రపంచకప్ గెలవడం ద్వారా భారత్ హ్యాట్రిక్ సాధించాలని అనుకుంటోందని చెప్పాడు. అదే ఏడాది లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో విజేతగా నిలవాలని కోరుకుంటోందని సూర్య అన్నాడు.

బంగ్లాదే వన్డే సిరీస్

మీర్పుర్: పాకిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య బంగ్లాదేశ్ 2-1తో కైవసం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో బంగ్లా 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. 291 పరుగుల ఛేదనలో పాకిస్థాన్ ఆరంభం నుంచి తడబడింది. చివరి మ్యాచ్‌లో వివాదాస్పద రీతిలో రనౌటైన సల్మాన్ ఆఘా (106; 98 బంతుల్లో 9ఐ4, 4ఐ6) సెంచరీతో మెరిసినప్పటికీ పాక్‌కు పరాభవం తప్పలేదు. ఆ జట్టు సరిగ్గా 50 ఓవర్లలో 279 పరుగులకు ఆలౌటైంది. అబ్దుల్ సమద్ (34), సాద్ మసూద్ (38), కెప్టెన్ షహీన్ షా అఫ్రిది (37) పోరాటం సరిపోలేదు. అసాధారణంగా పోరాడిన ఆఘాను 48వ ఓవర్లో తస్కిన్ అహ్మద్ (4/49) ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ముస్తాఫిజుర్ రెహ్మాన్ మూడు, నహిద్ రాణా రెండు వికెట్లు పడగొట్టారు. మొదట బంగ్లాదేశ్ 5 వికెట్లకు 290 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తంజిద్ హసన్ (107; 107 బంతుల్లో 6ఐ4, 7ఐ6) శతకంతో చెలరేగాడు. సైఫ్ హసాన్ (36), లిటన్ దాస్ (41), తౌహిద్ హృదోయ్ (48 నాటౌట్) ఆకట్టుకున్నారు. పాక్ బౌలర్లలో రవూఫ్ (3/52) పర్వాలేదనిపించాడు.

మెగాస్టార్.. బుల్లితెరను కూడా బ్లాస్ట్

మెగాస్టార్ చిరంజీవి బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సునామీ ఇంకా తగ్గకముందే, ఇప్పుడు బుల్లితెరపై కూడా తన విశ్వరూపాన్ని చూపించారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం ఏ స్థాయిలో సక్సెస్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక ఓటీటీ లో కూడా ట్రెండింగ్ లో నిలిచిన విషయం తెలిసిందే. ఇక ఇప్పుడు బుల్లితెరపై కూడా అదే రేంజ్ లో సౌండ్ చేస్తోంది.

ఇటీవల జీ తెలుగులో ప్రసారమై ఏకంగా 14.2 టీఆర్పీ రేటింగ్‌ను సొంతం చేసుకుంది. ఫిబ్రవరి 28న జరిగిన ఈ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌కు వచ్చిన స్పందన చూస్తుంటే, మెగాస్టార్ క్రేజ్ వెండితెరపైనే కాదు.. ఇళ్లలో కూడా ఏమాత్రం తగ్గలేదని స్పష్టమవుతోంది. థియేటర్లకు వెళ్లని ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఈ సినిమాను ఎంతగా ఆదరించారో ఈ నెంబర్లు చెబుతున్నాయి.

ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన ఈ సినిమా, అటు చిరంజీవి కెరీర్‌లోనూ, ఇటు అనిల్ రావిపూడి కెరీర్‌లోనూ బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 300 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. థియేటర్లలో రికార్డులు తిరగరాయడమే కాకుండా, ఓటీటీ ప్లాట్‌ఫారమ్ జీ5 లో కూడా గత నెలలో వచ్చినప్పుడు భారీ వ్యూస్ రాబట్టింది. ఇప్పుడు టీవీలో కూడా అదే జోరును కొనసాగిస్తూ 'క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్' అని నిరూపించుకుంది.

ఒక రకంగా చెప్పాలంటే థియేటర్, ఓటీటీ, టీవీ.. ఇలా మూడు చోట్లా ఈ సినిమా హ్యాట్రిక్ రికార్డులు సృష్టించింది. దర్శకుడు అనిల్ రావిపూడి మార్క్ కామెడీకి, చిరంజీవి మేనరిజమ్స్ తోడవ్వడం ఈ సినిమా విజయానికి ప్రధాన కారణం. గత కొంతకాలంగా మెగాస్టార్ నుండి పక్కా మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది ఒక విందు భోజనంలా అనిపించింది. ఈ భారీ విజయంపై అనిల్ రావిపూడి ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. థియేటర్లలో చూపించిన అదే ఉత్సాహాన్ని, నవ్వులను బుల్లితెరపై కూడా కొనసాగించినందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

కేవలం మాస్ అంశాలకే పరిమితం కాకుండా భావోద్వేగాలను కూడా సమానంగా పండించడం ఈ సినిమాకు ప్లస్ అయ్యింది. ప్రస్తుత కాలంలో పెద్ద సినిమాలు విడుదలైన నెల రోజులకే టీవీల్లో వచ్చేస్తున్నాయి. ఇలాంటి పోటీలో కూడా 14.2 రేటింగ్ సాధించడం అంటే మామూలు విషయం కాదు.

సోషల్ మీడియాలో కూడా ఈ రేటింగ్స్ గురించి చర్చ నడుస్తోంది. చిరంజీవి తన వింటేజ్ లుక్ తో ప్రేక్షకులను మరోసారి మాయ చేశారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సినిమాలోని సంభాషణలు, చిరు టైమింగ్ ఫ్యామిలీ ఆడియన్స్‌ను పక్కాగా కనెక్ట్ చేశాయి. ఒక సినిమాకు సరైన కంటెంట్ తోడైతే అది ఏ ప్లాట్‌ఫారమ్‌లో వచ్చినా ఆదరిస్తారని 'శంకరవరప్రసాద్ గారు' మరోసారి ప్రూవ్ చేశారు. 2026 ప్రారంభంలోనే చిరంజీవి ఒక సాలిడ్ బ్లాక్ బస్టర్ ను తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సినిమా ఇచ్చిన బూస్ట్‌తో ఆయన తన తదుపరి చిత్రాలను కూడా అదే ఎనర్జీతో పూర్తి చేస్తున్నారు. థియేటర్లలో చూడలేకపోయిన వారు, మళ్ళీ మళ్ళీ చూడాలనుకున్న వారు టీవీకి అతుక్కుపోవడంతో ఈ రేటింగ్స్ సాధ్యమయ్యాయి. సమ్మర్ హాలిడేస్ కూడా వస్తుండటంతో భవిష్యత్తులో జరిగే మరిన్ని టెలికాస్ట్ లలో కూడా ఈ సినిమా మంచి టీఆర్పీని నమోదు చేసే అవకాశం ఉంది. మెగాస్టార్ మ్యాజిక్ బాక్సాఫీస్ వద్దే కాదు.. బుల్లితెరపై కూడా ఎవర్ గ్రీన్ అని ఈ చిత్రం నిరూపించింది.

శివంగి వర్మ సొగసైన లుక్స్

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com